J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 41 సంచిక : 45 15.4.2022, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## మంత్రివర్గ మార్పుతో...

# కొందరికి ప్రమోషన్.. ఎందరికో ఎమోషన్!

రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు, న్యాయస్థానాలలో వ్యతిరేక తీర్పులు, కలవరపెడుతున్న విద్యుత్ లోటు, ఉద్యోగులలో అసంతృప్తి, కుంటుపడిన మౌలిక సదుపాయాల కల్పన, బ్రేకులు పడుతున్న మూడు రాజధానుల ఏర్పాటు, కొత్త జిల్లాల ఏర్పాటుతో ఐఏఎస్.. ఐపిఎస్‌ల కొరత.. వంటి అనేక సమస్యలతో తలమునకలవుతున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి తాజాగా జరిగిన మంత్రివర్గ మార్పు కొత్త సమస్యను తెచ్చిపెట్టినట్లయ్యిందనే భావన పార్టీ వర్గాలలో వ్యక్తమవుతోంది.

- అంతా తానే అయ్యి చక్రం తిప్పిన సజ్జల
- పార్టీలో ఉవ్వెత్తున రేగిన అసంతృప్తి జ్వాల
- 'కొత్త సమస్య'తో ఆశ్చర్యచకితులైన ముఖ్యమంత్రి
- అనుకున్న మైలేజీ వచ్చిందా అన్న అంతర్మథనంలో వైసీపీ శ్రేణులు!

పాలనా పరంగా ఎన్ని ఇబ్బందులు, కష్టాలూ ఉన్నా... పార్టీ పరంగా ఇన్నాళ్లూ సాఫీగా సాగిపోతూ వచ్చింది. ఇప్పుడు కొత్త మంత్రివర్గం ఏర్పాటు పార్టీకి కొత్త తలనొప్పి తెచ్చి పెట్టిందనే మాట సర్వత్రా వినిపిస్తోంది. కొత్త క్యాబినెట్ పుణ్యమా అని కొందరు ఎంఎల్‌ఎలకు ప్రమోషన్ లభిస్తే... మరికొందరిలో ఎమోషన్ రగిలించింది!

ఎప్పుడెప్పుడా అని రాజకీయవర్గాలు ఆరునెలలుగా 'కొత్త' మంత్రివర్గం కోసం ఎదురు చూశాయి. రాష్ట్ర మంత్రివర్గ 'మార్పు' ఎట్టకేలకు మొన్న 11వ తేదీన పూర్తయ్యింది. మొత్తం మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో నూటికి నూరు శాతం లేదా కనీసం 90 శాతం మంది కొత్తవారు ఉంటారనే పార్టీ అంచనాలు, ఆశలకు విరుద్ధంగా.... సుమారు 56 శాతం మందే కొత్తవారు ఉన్నారు. మిగిలిన 44 శాతం మంది పాతవారే కొనసాగడం గమనార్హం.

10లో

## కాకాణి ఇన్..

3లో



## అనిల్ ఔట్





# విసనకర్రలివిగో.. విసురుకోండి

## విద్యుత్‌కోతల పట్ల కోటంరెడ్డి శీనయ్య వినూత్న నిరసన



'విసనకర్రలివిగో విసురుకోండి..కరెంటు ఎటూ ఉండదు కాబట్టి కొవ్వొత్తులు వెలిగించుకోండి' అంటూ వైకాపా పాలన తీరును దుయ్యబడుతూ ఇంటింటికీ వెళ్ళి విసనకర్రలు, కొవ్వొత్తులు పంపిణీ చేశారు టిడిపి నగర నాయకుడు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి. వైకాపా అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి జగన్ మూడేళ్ళ పాలనలో ఆంధ్రప్రదేశ్ విద్యుత్‌కోతలతో అంధకారంగా మారిపోతోందని, ఇంతకన్నా వైకాపా పాలనలో సాధించిందేమీ లేదని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో విద్యుత్‌కోతలతో ప్రజల జీవనం అస్తవ్యస్తంగా తయారైందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల నెల్లూరులోని గుర్రాలమడుగు సంఘం, చీపురుకట్ట సంఘం, సర్వేపల్లి కాలువకట్ట తదితర ప్రాంతాల్లో ఆయన ఇంటింటికీ వెళ్ళి ప్రజలను కలుసుకుని వారికి విసనకర్రలు, కొవ్వొత్తులు పంపిణీ చేస్తూ వైకాపా పాలన పట్ల నిరసన వ్యక్తం చేశారు. వైకాపా ప్రభుత్వం అన్ని రంగాల్లో ఘోరంగా విఫలమైందని, ఆ పార్టీకి రానున్న రోజుల్లో ప్రజలే గుణపాఠం చెప్తారని అన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో టిడిపి నాయకులు ధర్మవరం సుబ్బారావు, కప్పిర శ్రీనివాసులు, పసుపులేటి మల్లికార్జున్, కల్యాణి, రేవతి తదితరులు పాల్గొన్నారు.

## సుమధుర పద్య గద్య సమాహారం..

# 'శ్రీ సీతారామ కల్యాణము' గ్రంథ త్రయం





**రచయిత: కోట రాజశేఖర్**
**వెల: రూ. 650/- (3 గ్రంథాలు)**
**ప్రతులకు : కోట రాజశేఖర్**
**ఇ.నెం. 4-338, 3వ అడ్డరోడ్డు, మొదటి వీధి, కె.ఆర్.ఆర్.నగర్, పడుగుపాడు, కోవూరు మండలం, నెల్లూరుజిల్లా.**
**99662 36604**

***శ్రీరాముని దయతో సీ***
***తారాముల గాథ వ్రాయదలచితి పద్య***
***శ్రీ రాజిల, గురువులు మన***
***సారన్ దీవింప దలతు శారదను మదిన్'..***

అంటూ ఎంతో భక్తితో అవధాని కోట రాజశేఖర్ ఇటీవల రచించిన 'శ్రీ సీతారామ కల్యాణము'..మూడు గ్రంథాలు (గ్రంథ త్రయం) ప్రముఖులందరి ప్రశంసలందుకుంటున్నాయి. ఇనమడుగు శ్రీ సత్యానందాశ్రమం ఆస్థాన పండితులు, ప్రత్యేకించి రామాయణోపన్యాసకులు.. అల్లూరులోని రామకృష్ణా జూనియర్ కళాశాల విశ్రాంత సంస్కృతోపన్యాసకులు.. ప్రముఖ అవధాని కోట రాజశేఖర్ అవిశ్రాంతంగా రచించిన ఈ గ్రంథత్రయానికి ఇటీవలే కన్నుల పండువగా ఆవిష్కరణోత్సవాలు జరిగాయి. శ్రీమద్రామాయణంలోని ఘట్టాలను, ముఖ్యంగా బాలకాండను పద్యగద్యాత్మకంగా..ఎంతో హృద్యంగా అనువదించిన ఆ గ్రంథాలు అందరి అభినందనలు అందుకుంటున్నాయి. అటు దివ్యమైన భద్రాద్రిలోనూ, ఇటు నెల్లూరులోని బాలాజీనగర్ సీతారామమందిరంలోనూ ఆవిష్కృతమైన ఆ గ్రంథత్రయాన్ని.. ఆ గ్రంథాల్లో ఇనుమడించిన భక్తిభావ మధురిమను, తెలుగు భాషామాధుర్యాన్ని ఎందరో పండితులు ఎంతగానో కొనియాడారు కూడా.

తమ గురువులైన ప్రఖ్యాత అవధాని నరాల రామారెడ్డి, 'వ్యాస మహాభారతం' అనువాదకులు సూరం శ్రీనివాసులు, పంచసహస్రావధాని డా.మేడసాని మోహన్ తదితరుల ఆశీస్సులతో తాను ఈ గ్రంథాలను రచించానని గ్రంథకర్త తన ముందుమాటల్లో వినమ్రంగా తెలియజేశారు. సుమారు 450 పేజీలతో వాల్మీకి మహర్షి శ్లోకాలతో పాటు పద్యాలను, భావాలను పద్య సప్తశతి 'శ్రీ సీతారామ కల్యాణము' అనే శ్రీమద్రామాయణ-బాలకాండకు అనువాదంగా, 256 పేజీలతో 761 పద్యాలతో పద్య కావ్యంగా, మరో 132 పేజీలలో వచనానువాదంగా మూడు విధాలుగా రూపొందించి శ్రీరామునిపై తనకున్న భక్తిప్రపత్తులను చాటుకున్నారాయన. ప్రత్యేకించి 'శ్రీ సీతారామకల్యాణము' (బాలకాండ వచనానువాదం) పండితులకే కాక పామరులకు కూడా బాగా అర్థమయ్యేవిధంగా సులభ శైలిలో వెలువరించడం విశేషం. అంతేకాదు ఆ పద్యాలను ఆడియో సీడీ రూపంలోనూ, అవతారిక పద్యాలను వీడియో సీడిగా కూడా రూపొందించారు. తన హృదయమందిరంలో ప్రతిష్ఠితమై ఉన్న ఆ సీతారామచంద్రులను భక్తిపరిమళాలు వెదజల్లే పద్యగద్య సుమాలతో అర్చించి,

***సతతము నీదు నామమె ప్రశస్తమటంచు జపించుచుంటి, నా తత శుభధాయక మ్మనుచు దావక గాథ రచించుచుంటి, నీ కతమున మోక్షసంపద సుఖమ్మున నందగ నుంటి, నీకు నంకితమిడుచుంటి దీని బరికించి గ్రహింపుము జానకీపతీ!...***

అంటూ ఆ గ్రంథత్రయాన్ని 'శ్రీరామాంకితం' గావించి గ్రంథకర్త తన జీవితాన్ని సార్థకం చేసుకున్నారు. పాఠకుల మనసుల్లో నిండుగా రామభక్తిని నింపే ఈ గ్రంథ త్రయంలో అన్ని పద్యాలు ఎంతో విలక్షణమైనవి, విశిష్టమైనవి కూడా. ఏ పద్యానికా పద్యం, ఏ గద్యానికా గద్యం.. దేని ప్రత్యేకత దానిదే అన్నట్లుంటాయి. పండితశైలితో పాటు సామాన్యులకు కూడా అర్థమయ్యే సులభశైలి కూడా అవధాని అయిన ఈ గ్రంథకర్తకు మెండుగా ఉండడంతో గ్రంథకర్త ఈ మూడు గ్రంథాలను అత్యద్భుతంగా తీర్చిదిద్దారని చెప్పవచ్చు.

అందుకే శ్రీ శ్రీహరితీర్థ స్వాముల వారితో పాటు ప్రముఖ కవి పండితులు కంది శంకరయ్య, చక్రాల లక్ష్మీకాంత రాజారావు, చదలవాడ లక్ష్మీనరసింహారావు, డా.చీమకుర్తి వెంకటేశ్వరరావు, ఆముదల మురళి, కొండపి మురళీకృష్ణ, చిటితోటి విజయకుమార్, శ్రీ పండి ఢిల్లీశు, మైలవరపు మురళీకృష్ణ, పైడి హరనాథరావు వంటి వారంతా గ్రంథకర్త రచనా ప్రతిభను మెచ్చుకుంటూ తమ ఆశీస్సులు, అభినందనలు తెలియజేశారు. 'రాజశేఖర్ రచించిన శ్రీ సీతారామ కల్యాణ కావ్యం మృదులమైన, మధురమైన శైలిలో సాగింది. ఇతివృత్తంతో పాటు వృత్త రచన ధారాళంగా ప్రవహించింది. వ్యర్థ పదాలు లేకుండా అన్వయక్లిష్టత లేకుండా ప్రతి ఘట్టాన్ని తీర్చిదిద్దిన రాజశేఖర్ కృషిని అభినందించక తప్పదు. వాల్మీకి సంస్కృత శ్లోకాలను అందమైన తెలుగులో అనువదించిన చిరంజీవి రాజశేఖర్ ప్రతిభ ప్రశంసనీయం'..అంటూ ప్రముఖ అవధాన కవి నరాల రామారెడ్డి తన ముందుమాటలో రాశారు. ఈ గ్రంథత్రయం విశిష్టత గురించి ఇంతకన్నా గొప్ప మాటలు ఇంకేముంటాయి?..ఈ అద్వితీయమైన శ్రీ సీతారామ కల్యాణ గ్రంథాలను అత్యద్భుతంగా వెలుగులోకి వచ్చేందుకు.. ముద్రణకు అవసరమైన నిధులను సమకూర్చిన రామభక్తుడు..అమెరికాలో ఉన్న అడవికొలను వేంకట్ (వేంకటేశ్వరరావు) ఎంతైనా ధన్యులు!..ఈ గ్రంథాలు అటు రామభక్తులకు, ఇటు పాఠకులకు కరదీపికగా ఉంటాయనడంలో ఎలాంటి సందేహం లేదు. ఈ విశిష్ట గ్రంథత్రయ కర్త..కోట రాజశేఖర్‌కు నా అభినందనలు..శుభాశీస్సులు!



**సమీక్షకులు:**
**పరమహంస**
**బెంగుళూరు**
**99633 41928**

వీక్షణం 49
- మంజీరరెడ్డి

## 'పినాకినీ గాంధీజీ ఆశ్రమం'..

# ఓ మరపురాని జ్ఞాపకం

గాంధీజీ మనకు నిత్యం గుర్తుకు వచ్చే ఓ జ్ఞాపకం. నిత్యం గుర్తుకు రావాల్సిన జ్ఞాపకం కూడా. గుజరాత్ రాష్ట్రంలో గాంధీజీ పుట్టిన పోర్‌బందర్... ఓ జ్ఞాపకం, గాంధీజీ పెరిగిన రాజ్‌కోట్‌లోని 'కాబా నా డిలో'... మరో అందమైన జ్ఞాపకం. అహ్మదాబాద్ సబర్మతి నది తీరాన గాంధీజీ నివసించిన ఆశ్రమం... అపురూపమైన జ్ఞాపకం. బాపూజీని ఇన్ని జ్ఞాపకాలతో గుర్తు చేసుకునే నాకు మన జిల్లాలో పెన్నా నది తీరాన విస్తరించిన గాంధీ ఆశ్రమం కేవలం జ్ఞాపకం మాత్రమే కాదు. అందమైన, అపురూపమైన అనిర్వచనీయమైన ఆనందం.

### కనకమ్మ ప్రసన్నత

ఇందుకూరుపేట మండలం, పల్లిపాడు గ్రామంలోని పినాకినీ సత్యాగ్రహ ఆశ్రమం వందేళ్ల పండగ చేసుకుంది. మన దేశం ఆజాదీకా మహోత్సవ్ పేరుతో 75ఏళ్ల స్వాతంత్ర్య ఉత్సవాలను జరుపుకుంటున్న తరుణంలో పినాకినీ ఆశ్రమం వందేళ్లు పూర్తి చేసుకుని 'జాతీయోద్యమానికి భూమికను' అని సగర్వంగా చాటుకుంటోంది. జాతీయోద్యమంలో ప్రధాన భూమిక పోషించిన మహిళలకు ప్రతీక పొణకా కనకమ్మ. ఆమె విగ్రహం ఆశ్రమంలోకి వస్తున్న వారిని సంతృప్తిగా చూసుకుంటున్న ఓ మాతృమూర్తిగా సన్నటి చిరునవ్వుతో ప్రసన్నవదనంతో ఓ పక్కగా ఉంటుంది. రుస్తుంజీ భవనం ఎదురుగా 'సత్యమేవ జయతే' అంటూ ధ్యానముద్రలో ఉన్న గాంధీజీ విగ్రహం కాంతులీనుతూ ఉంటుంది.



***జాతి గుర్తుంచుకోవాల్సిన ఓ మధురమైన జ్ఞాపకం మన రాష్ట్రంలో ఉంది. మన నెల్లూరుజిల్లాలో ఉంది. అందుకు మనందరం గర్వపడాలి. ప్రతి ఒక్కరం జాతీయోద్యమ స్ఫూర్తిని కొనసాగిద్దాం. పిల్లలను ఇక్కడికి తీసుకువచ్చి గాంధీజీని చూపిద్దాం. జాతీయోద్యమంలో త్యాగాలు చేసిన యోధులను పరిచయం చేద్దాం. ఆధునిక డిజిటల్ యుగంలో ప్రపంచదేశాలన్నీ మనవే అయినప్పటికీ, 'మన జాతీయత మనదేనని, మనది మాత్రమే'నని పిల్లలకు తెలియచేద్దాం. జాతీయతకు వందనం చేద్దాం. 75 ఏళ్లుగా మనం ఆస్వాదిస్తున్న స్వేచ్ఛావాయువులకు ప్రణమిల్లడం ఎలాగో పిల్లలకు నేర్పిద్దాం. ఆ స్వేచ్ఛాస్వాతంత్ర్యాలను మనకు అందించిన త్యాగమూర్తులకు చేతులెత్తి మొక్కడానికి భేషజాలకు పోవద్దని, బిడియపడవద్దని నేర్పిద్దాం. మనం ఏది చేస్తే పిల్లలు అదే నేర్చుకుంటారు. ముందుగా మనమే బాపూజీకి చేతులెత్తి మొక్కుదాం.***

### సమరయోధులు

ఆశ్రమంలోని ప్రధాన మందిరంలోకి అడుగు పెట్టగానే దైవసన్నిధానం వంటి ప్రశాంతత అలరిస్తుంది. గోడలకు స్వాతంత్ర్య సమరయోధుల ఫొటోలు ఒకటి కాదు రెండు కాదు. పదుల సంఖ్యలో ఉంటాయి. దేశమాతను దాస్యశృంఖలాల నుంచి విముక్తం చేయడానికి వాళ్లు తమ జీవితాలను త్యాగం చేశారు. ఇప్పుడు మనం అనుభవిస్తున్న అపారమైన స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు వాళ్లు పెట్టిన భిక్ష. ఈ సమరయోధుల్లో మహిళాశక్తికి కొదవేమీ లేదు. మన జిల్లాలో జాతీయోద్యమకాలంలో మహిళాచైతన్యం మెండుగానే ఉందని చెప్పకనే చెబుతాయి ఆ ఫొటోలు. మరోవైపు ధ్యానముద్రలో ఉన్న గాంధీజీ చిత్రం. ఖాదీమాలతో జాతీయత భావాన్ని పెంపొందిస్తూ ఉంటుంది. ఆ ఫొటో ఎదురుగా సబర్మతి ఆశ్రమంలో ఉన్నట్లే చాప మీద చిన్న పరుపు, రాసుకోవడానికి చెక్క బల్ల. బాపూజీ ఫొటో పక్కనే గొప్ప ఆశ్రమ సేవకులు, గాంధేయవాది చతుర్వేది వెంకటకృష్ణయ్య, ఆ పక్కనే స్థల దాత పొణకా కనకమ్మ ఫొటోలను చూడగానే వాళ్లకు దక్కాల్సిన గౌరవం దక్కిందనే సంతృప్తి కలుగుతుంది. ఆ పక్కనే ఒక బ్లాక్‌బోర్డు మీద గాంధీజీ జీవితంలోని ముఖ్యమైన సంవత్సరాలతో కూడిన పట్టిక ఉంటుంది. ఆ పట్టిక గాంధీజీ జీవితచరిత్రకు క్లుప్తమైన రూపం. ఇలాంటి పట్టిక సబర్మతి ఆశ్రమంలో, రాజ్‌కోట్‌లో గాంధీజీ పెరిగిన ఇంట్లో కూడా ఉంటుంది. అక్కడ ఇంగ్లీష్‌లో ఉంటుంది. పల్లిపాడు ఆశ్రమంలోని పట్టికలో ఈ ఆశ్రమాన్ని ప్రారంభించిన ఘట్టం కూడా ఉండడం విశేషం. ఆ బోర్డు ఎదురుగా నేల మీద తిరంగ చరఖా. చరఖా పక్కనే గోడకు ఆనుకుని కూర్చున్నట్లుగా మూడు కోతులు. 'చెడు చెప్పవద్దు, చెడు చూడవద్దు, చెడు వినవద్దు' అనే నినాదాలతో ఉన్న ఆ బొమ్మలను చూసినప్పుడు 'ఇక్కడ చెడు చూద్దామన్నా కనిపించదు, చెడు విందామన్నా వినిపించదు, ఇక చెడు చెబుదామన్నా నోరు పెగలదు. ఇది మనిషికి అత్యంత ఉదాత్తంగా జీవించడాన్ని నేర్పించే మార్గం' అని కూడా అనిపిస్తుంది. ఆ బొమ్మలకు పైభాగాన ఒక బోర్డు మీద ఆశ్రమానికి సేవలందించిన సేవకుల పేర్లుంటాయి. పొణకా కనకమ్మ విరాళంగా ఇచ్చిన 13 ఎకరాల భూమిలో జాతీయ కాంగ్రెస్ నిధి పదివేల రూపాయలు, రుస్తుంజీ విరాళం పది వేల రూపాయలు, మునగాల రాజా ఇచ్చిన రెండు వేల రూపాయలతో నిర్మాణం జరిగినట్లు వివరాలుంటాయి. ఆశ్రమ నిర్మాణం కోసం స్వేదం చిందించిన ప్రతి ఒక్కరినీ తలుచుకుంటూ వారి జ్ఞాపకాలను పొందుపరచడం గొప్ప ఔన్నత్యం.

### శ్రీరాములు చరఖా

అదే గదిలో ఓ చిన్న బల్ల మీద మరో చరఖా ఉంది. అది పేటీ చరఖా. ప్రయాణాల్లో తమ వెంట తీసుకువెళ్లగలిగిన చిన్న చరఖా అన్నమాట. ఆ చరఖా పెట్టెలో ఉంటుంది. మూతపెడితే సూట్‌కేస్‌లాగ పట్టుకుని వెళ్లవచ్చు. జాతీయోద్యమకారులు ఒకచోట నుంచి మరో చోటకు వెళ్లినప్పుడు తమ వెంట ఇలాంటి పేటీ చరఖాను తీసుకువెళ్లేవారన్నమాట. ఇక్కడ కనిపించే చరఖా పొట్టి శ్రీరాములు గారిది. గాంధీజీ ఫొటోకి మరోవైపు పొట్టి శ్రీరాములు గారి చరఖాకు పైభాగాన ఆశ్రమ వ్యవస్థాపకులు బుచ్చి కృష్ణమ్మ, దిగుమర్తి హనుమంతరావు ఫొటోలుంటాయి. మరో రెండు గదుల్లో ఉన్న ఫొటో గ్యాలరీలో గాంధీజీ జీవితంలోని ముఖ్యమైన ఫొటోలుంటాయి. ఇలాంటి గ్యాలరీ ముంబయిలో ఉంది. రాజ్‌కోట్‌లోని ఇంట్లో కూడా ఉంది. ఈ గదిలో ఒక ర్యాక్‌లో గాంధీజీ సాహిత్యం కూడా ఉంది. బయటకు వచ్చేటప్పుడు 'నా జీవితమే నా సందేశం' అంటూ గాంధీజీ విగ్రహం మౌనంగా వీడ్కోలు పలుకుతుంది.



# కాకాణి ఇన్

## మూడు శాఖల మంత్రిగా గోవర్ధన్‌రెడ్డి

### వ్యవసాయం, సహకారం, మార్కెటింగ్‌లకు ఆయనే సారథి

**ఆయన విద్యావంతుడు. సమర్థమైన వ్యాపారవేత్త. తండ్రి వారసత్వంగా రాజకీయ ఆరంగేట్రం చేసి అంచలంచెలుగా ఎదిగి నేడు రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అపర రాజకీయ మేధావి. ఆయనే కాకాణి గోవర్ధన్‌రెడ్డి.**

నెల్లూరుజిల్లా పొదలకూరు మండలంలో సుదీర్ఘ రాజకీయ చరిత్ర కలిగి... సౌమ్యశీలి, మృధుస్వభావి, మంచి మనసున్న మారాజుగా పల్లెవాసుల మనసు దోచుకున్న సేవా తపస్వి కీర్తిశేషులు కాకాణి రమణారెడ్డి. ఆయన ఏకైక వారసుడు గోవర్ధన్‌రెడ్డి. అందరూ గిరీ అని పిలుచుకునే గోవర్ధన్‌రెడ్డి ఇంజనీరింగ్ పట్టభద్రుడు. విద్యాభ్యాసం పూర్తిచేసిన తరువాత ఆయన నేరుగా గ్రామ రాజకీయాలలో ప్రవేశించ లేదు. రాజకీయాలలో రాణించాలంటే తమ నాన్న లాగా కేవలం మంచితనం సేవా తత్వం ఉంటే సరిపోవని అనుకున్నాడు. ఆర్థికంగా కూడా బలంగా ఉండాలని నిర్ణయించుకున్నాడు. పూజిత కన్‌స్ట్రక్షన్స్ పేరుతో నిర్మాణ సంస్థని ప్రారంభించారు. వ్యాపార రంగంలో అకుంఠిత దీక్షతో శ్రమించి ఉన్నత స్థితికి చేరుకొని ఇక ఆర్థికంగా తనకు వెనుకకు తిరిగి చూసుకోవలసిన అవసరం లేదనుకున్న తరువాత క్రమేణా తన దృష్టి పొలిటిక్స్ వైపు సారించాడు.

అప్పటికే జిల్లాలో కాకాణి రమణారెడ్డి అంటే ఆనం వారికి అత్యంత ప్రీతిపాత్రుడన్న పేరుంది. ఆనం వారి సాంగత్యంలో రమణారెడ్డి కేవలం సమితి అధ్యక్ష పదవికే సుదీర్ఘకాలం పరిమితమైపోయారన్న విమర్శ కూడా అప్పట్లో బాగా వినపడేది. అయితే గోవర్ధన్‌రెడ్డికి అది నచ్చలేదు. తమ కుటుంబమే ఒకరికి నీడగా ఉండాలి, అంతే తప్ప తాము ఇంకొకరి నీడలో బ్రతకడం ఏంటని భావించారు. 2004లో జరిగిన ఎన్నికలలో ఆనం రామనారాయణరెడ్డి విజయానికి కృషిచేసినా, ఆ తరువాత తాను స్వతంత్రంగా ఎదగడానికి పావులు కదుపుతావచ్చాడు. 2006లో జిల్లాపరిషత్ అభ్యర్థిగా అప్పటి ముఖ్యమంత్రి దివంగత నేత రాజశేఖరరెడ్డి తన పేరును ప్రతిపాదించేలా చేసుకున్నాడు. ఆ సందర్భంలో తన సమీప బంధువు, ప్రస్తుత రూరల్ శాసనసభ్యుడు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రదర్శించిన రాజకీయ చాణుక్యతతో, ఆనం రామనారాయణరెడ్డి సహకారంతో జడ్పీటీసీగా ఏకగ్రీవంగా ఎన్నికై జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు.

**నిర్విరామ శ్రమ, నిస్వార్థ పాలనతో**

## జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా చెరగని ముద్ర...

జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన అనతికాలంలోనే సమర్థవంతమైన నాయకుడిగా పేరు తెచ్చుకున్నారు. జిల్లాలో గ్రామీణ విద్యావ్యవస్థలో సమూల మార్పులు తెచ్చారు. రైతుబిడ్డగా రైతుల సమస్యల పట్ల స్పందించడంలోనూ, జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో పనిచేసే అన్ని ప్రభుత్వ విభాగాల పనితీరును మెరుగుపరచడంలోనూ అహరహం శ్రమించి పాలనలో తనదైన ముద్ర వేసుకున్నారు. స్పందించే హృదయమున్న సహృదయ నేతగా తన సహచర సభ్యులలోనూ, ఉద్యోగులలోనూ మంచిపేరు తెచ్చుకున్నారు. తన అయిదేళ్ళ కాలంలో అత్యుత్తమ ఛైర్మన్‌గా కాకాణి గోవర్ధన్‌రెడ్డి చెరగని ముద్ర వేసుకున్నారు.

## ఒడిదుడుకులతో సాగిన ప్రస్థానం....

జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా సేవలు అందిస్తూనే 2009లో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో శాసనసభ్యత్వానికి టిక్కెట్టు ఆశించి భంగపడ్డారు గోవర్ధన్‌రెడ్డి. ఎన్నికల సమయంలో అలిగి కొన్ని రోజులు కాంగ్రెస్ పార్టీకి, పార్టీ నాయకులకు దూరంగా ఉన్నారు. ఆ తరువాత తానున్నానంటూ రాజశేఖరరెడ్డి ఇచ్చిన భరోసా తరువాత అలక పాన్పు దిగారు. 2011 వరకు కాంగ్రెస్‌పార్టీలో కొనసాగి తరువాత జగన్ మోహన్‌రెడ్డికి అండగా వైసీపీలోకి ప్రవేశం చారు. జిల్లా అధ్యక్షుడిగా ఒక పర్యాయం పనిచేసి తన ప్రతిభను చాటుకున్నారు. రాష్ట్ర విభజన తరువాత మళ్ళీ ఆయననే నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా పార్టీ నియమించింది. 2014లోను మళ్ళీ 2019లోను సర్వేపల్లి నుండి వైసీపీ తరపున పోటీచేసి శాసనసభకు ఎంపికయ్యారు గోవర్ధన్‌రెడ్డి. ఇక్కడినుండే ఆయన వరవడి మారింది. సహజంగా ఫక్తు రాజకీయ నాయకుడికి ఉండాల్సిన లక్షణాలన్నిటినీ అలవరుచుకున్నారు. తనకంటూ ఒక వర్గం ఉండాలన్న లక్ష్యాన్ని సాధించడం కోసం అడుగులు వేయడం మొదలుపెట్టారు. ప్రతిపక్షాలని, తన ప్రధాన ప్రత్యర్థి సోమిరెడ్డిని ఘాటైన విమర్శలు చేసి వార్తలకెక్కారు. తన ముక్కుసూటి విధానాలతో సొంత పార్టీలో సైతం శత్రువులను ఏర్పరుచుకున్నారు. తాను అందరి వాడినే కానీ అందరిలాంటి వాడిని కాదని చెప్పకనే చెప్పడం ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా తన పేరు వినపడేలా గుర్తింపు పొందారు. నిత్యం వార్తలలో ఉంటూ వ్యూహాత్మకంగా తన రాజకీయ భవిష్యత్తుకు తానే బాటలు వేసుకున్నారు. రెండున్నరేళ్ళ తరువాత మంత్రివర్గ మార్పు ఉంటుందని ముఖ్యమంత్రి జగన్ ప్రకటించినప్పటి నుండి తదుపరి విస్తరణలో తన పేరే ప్రధానంగా వినపడేలా వ్యూహం రచించుకున్నారు. అనుకున్నది సాధించి మూడు శాఖల మంత్రిగా ఇప్పుడు బాధ్యతలు చేపట్టారు. నెల్లూరుజిల్లా పరిషత్ ఛైర్మెన్ సీట్లో కూర్చున్న వారెవరికీ మళ్ళీ రాజకీయ భవిష్యత్తు ఉండదన్న సెంటిమెంటును గోవర్ధన్‌రెడ్డి బ్రేక్ చేశారు. రెండుసార్లు శాసనసభ్యుడిగా గెలవడంతో పాటు ఇప్పుడు మంత్రి కూడా అయ్యారు.




## మూడుశాఖల మంత్రిగా ప్రమాణస్వీకారం...

మంత్రి కావాలన్న తన చిరకాల వాంఛను నెరవేర్చుకుని, రాష్ట్ర వ్యవసాయ మంత్రిగా, సహకార, మార్కెటింగ్ శాఖల మంత్రిగా కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఈనెల 11న ప్రమాణస్వీకారం చేశారు. తొలి నుంచి వీరిది రైతు కుటుంబం కావడంతో రైతుల సమస్యలపై ఆయనకు బాగా అవగాహన ఉంది. ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు కూడా ఏమాత్రం తగ్గకుండా రైతుల కోసం పోరాటం సాగించారాయన. ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ఇచ్చి జిల్లాలో రైతులు నష్టపోకుండా చూడడం, రైతుభరోసా కేంద్రాల్లో అవకతవకలు సరిదిద్ది రైతులకు న్యాయం చేయడం ఇప్పుడు తక్షణావసరం. అంతే కాదు, వ్యవసాయపరంగా జిల్లా ఎన్నో సమస్యలతో సతమతమవుతోంది. రాష్ట్రంలో కూడా రైతుల సమస్యలు లెక్కలేనన్ని. ఆ సమస్యల సవాళ్ళన్నిటినీ ఎదుర్కొని అన్నదాతలకు అన్యాయం జరగకుండా చూసినప్పుడే రైతుబిడ్డ... వ్యవసాయమంత్రి అయ్యాడన్న సంతోషం ప్రజల్లో పదికాలాల పాటు ఉంటుంది. ఏదేమైనా, జిల్లా నుంచి ఎంతో ప్రాధాన్యత ఉన్న వ్యవసాయ మంత్రిగా.. మొత్తంగా మూడు కీలక శాఖలకు మంత్రిగా.. యువనేత.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంత్రివర్గంలో స్థానం సంపాదించుకున్న కాకాణికి 'లాయర్' అభినందనలు!

## అనిల్ అవుట్...!

మంత్రివర్గం మార్పు జరిగితే నెల్లూరు నగర శాసనసభ్యుడు, నీళ్ళ మంత్రి అనిల్ కుమార్‌యాదవ్‌కి ఉద్వాసన తప్పదని రాజకీయవర్గాలు భావించినట్లే ఆయనను మంత్రి పదవి నుండి తొలగించారు ముఖ్యమంత్రి జగన్. జగన్‌కి సన్నిహితుడిగా ఉంటూ 2014లో రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి రాని తరుణంలో సైతం నగర నియోజకవర్గం నుండి గెలుపొందాడు అనిల్‌యాదవ్. అయితే 2019లో రాష్ట్రమంతా ఒక ప్రభంజనంలా వైసీపీ వెంట నడిస్తే నెల్లూరు నగర ప్రజలు మాత్రం అత్యంత స్వల్ప మెజారిటీతో అనిల్‌ని గట్టెక్కించారు. అనిల్‌పై ఉన్న వ్యక్తిగత అభిమానం, బీసీలలో యువ నాయకుడన్న కోణం దృష్టిలో పెట్టుకుని రెడ్ల ప్రాబల్యం అధికంగా ఉన్న నెల్లూరు జిల్లా నుండి అనిల్‌యాదవ్‌కి మంత్రి వర్గంలో స్థానం కల్పించారు ముఖ్యమంత్రి. అత్యంత కీలకమైన నీటిపారుదల శాఖను అప్పగించారు. తాను మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటినుండి తనదైన తరహాలో రాజకీయాలు నెరపడం మొదలు పెట్టాడు అనిల్. సొంత పార్టీలోనే శత్రువులను పెంచుకున్నాడు. తాజాగా తన రాజకీయ భవిష్యత్తుతో పాటు ఇతర అన్ని విషయాలాలో తనకు తోడూ నీడగా ఉంటుండిన తన సమీప బంధువు డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్‌ని కూడా దూరం చేసుకున్నాడు. మంత్రి మండలి నుండి తనను తొలగించి కాకాణికి స్థానం కల్పించిన సమయంలో కూడా ఆయన విలేకరుల సమావేశం పెట్టి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. తనకు సహకరించిన జిల్లా శాసనసభ్యులను పేరు పేరునా సంబోధిస్తూ.. కాకాణి, ఆనం రామనారాయణరెడ్డి పేర్లను చెప్పలేదు. అలాగే నెల్లూరు పార్లమెంటు సభ్యులు ఆదాల ప్రభాకరరెడ్డి, రాజ్యసభ సభ్యులు, ముఖ్యమంత్రికి అత్యంత ఆంతరంగికులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పేరును కూడా అనిల్ విస్మరించడం ఇప్పుడు జిల్లా రాజకీయవర్గాలలో చర్చనీయాంశమయ్యింది. అంతేకాకుండా తాను మంత్రిగా ఉన్నపుడు కాకాణి తనకు ఇచ్చిన సహకారానికి, ప్రోత్సాహానికి రెట్టింపుగా తాను తిరిగి ఇస్తానని వ్యంగంగా చెప్పడం కూడా పార్టీ వర్గాలను విస్మయానికి గురి చేసింది. మొత్తానికి మంత్రివర్గ మార్పుతో జిల్లా రాజకీయాలలో పలు సంచలనాత్మక పరిణామాలు చోటు చేసుకోబోతున్నాయన్నది మాత్రం ఖాయమని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

# ఆదాల ఆత్మీయ అభినందన



నెల్లూరు జిల్లా నుంచి మంత్రివర్గంలో స్థానం పొందిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని విజయవాడలోని ఆయన నివాసంలో కలసి పుష్పగుచ్ఛం అందించి ఆత్మీయ అభినందనలు తెలుపుతున్న నెల్లూరు పార్లమెంటు సభ్యులు ఆదాల ప్రభాకర్‌రెడ్డి.

# అంబేద్కర్ ఆశయాలు స్ఫూర్తిదాయకం

### - నివాళులర్పించిన రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి



డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయాలు నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని, ఆ మహనీయుని ఆశయాలకు అనుగుణంగానే రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగుతుండడం సంతోషదాయమని రాజ్యసభ సభ్యులు, సేవాభూషణుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డా.అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని ఈనెల 13న ఆ మహనీయుని గొప్పతనాన్ని స్మరించుకుంటున్నామన్నారు. అంబేద్కర్ పుట్టినరోజు..ప్రతి ఒక్కరికీ పండుగరోజని, ప్రజాస్వామ్య పరిరక్షకునిగా, మహామేధావిగా డా.బిఆర్ అంబేద్కర్ పేరొందారని, దేశానికి ఆయన అమూల్యమైన సేవలందించారని ఆయన కొనియాడారు.

# పెంచలకోనలో నిత్యాన్నదానానికి.. లక్ష వితరణ

పెంచలకోన దేవాలయంలో నిత్యాన్నదాన పథకానికి గూడూరు మండలం తిప్పవరప్పాడు గ్రామానికి చెందిన భక్తుడు కె.పెంచలరెడ్డి ఈనెల13న లక్ష రూపాయల విరాళం ఇచ్చారు. ఆ మేరకు చెక్కును ఆయన ఆలయ ఇఓ వెంకటసుబ్బయ్యకు అందజేశారు.

# ఫ్రీజర్ బాక్సులు ఇక ఉచితం

### - రెడ్‌క్రాస్ ఛైర్మెన్ చంద్రశేఖర్‌రెడ్డి




ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, నెల్లూరు జిల్లా శాఖ ద్వారా ఇక నుంచి ఫ్రీజర్(శీతల శవపేటిక) బాక్సులను అద్దె లేకుండా ఉచితంగానే అందజేస్తామని రెడ్‌క్రాస్ జిల్లా శాఖ ఛైర్మెన్ పి.చంద్రశేఖర్‌రెడ్డి చెప్పారు. ఈ నెల 14న ఆయన నెల్లూరులోని రెడ్‌క్రాస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 1995లో రెడ్‌క్రాస్ 'మోర్గ్ సర్వీస్' ప్రారంభమైందని, మరణించిన వారిని భద్రపరచడానికి అవసరమైన ఫ్రీజర్‌లను అద్దె, రవాణా ఛార్జీలతో అందించే వారమని, ఒక్కో ఫ్రీజర్‌కు రోజుకు రూ.800, పై అంతస్తు లకైతే రూ.2,500 దాకా అద్దె ఉండేదని, ఇక నుంచి అద్దె తీసు కోకుండా కేవలం రవాణా ఛార్జీలతోనే వాటిని అందజేసేందుకు నిర్ణయించామని ఆయన తెలిపారు. ప్రస్తుతం రెడ్‌క్రాస్‌లో 5 ఫ్రీజర్ బాక్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని సేవాభావంతో రెడ్‌క్రాస్ వీటిని అద్దె లేకుండా అందిస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ప్రతినిధులు దాసరి రాజేంద్రప్రసాద్, కె.వెంకటేష్, బి.వెంకటరెడ్డి, పి.మస్తానయ్య, పి.గురునాథరావు తదితరులు పాల్గొన్నారు.

లాయర్
ఏప్రిల్ 15, 2022

# దటీజ్ భారత్..!

శాంతి సామరస్యాలకు ఆలవాలమైన భారత్.. ఇప్పుడే కాదు, ఎల్లవేళలా తన స్థితప్రజ్ఞతను చాటుకుంటూనే ఉంది. లోకకల్యాణాన్ని, విశ్వశాంతిని ఆకాంక్షించే భారత్..ఎంతో కీలకమైన సందర్భాల్లో కూడా తన మనోధైర్యాన్ని ప్రదర్శిస్తూ శాంతికి జయపతాకగా వెలుగొందుతూనే ఉంది. రష్యాతో స్నేహసంబంధాలు బలంగా ఉన్నప్పటికీ, మొన్నటికి మొన్న ఉక్రెయిన్‌లో రష్యా చేసిన విధ్వంసాన్ని, అమానవీయమైన హింసాకాండను తీవ్రంగా ఖండించి, హింసకు వ్యతిరేకంగా..శాంతికి మద్దతుగా తన గళాన్ని వినిపించి 'దటీజ్ భారత్' అనిపించుకుంది. రెండు దేశాల మధ్య యుద్ధంలో భారత్ ఎటువైపు ఉంటుందన్న ప్రశ్నకు ఎటూ తొణకకుండా 'శాంతి వైపు' అని భారత విదేశాంగమంత్రి జైశంకర్ పార్లమెంట్‌లో స్పష్టంగా చెప్పడం అందరినీ మంత్రముగ్ధులను చేసింది. ఎందుకంటే, ఇది శాంతిదూత.. జాతిపిత మహాత్మాగాంధీజీ పుట్టినిల్లు. శాంతికి-అహింసకు నిలయం భారతదేశం. ఇప్పుడే కాదు.. గతంలో కూడా.. ప్రపంచంలో పలు యుద్ధాలు జరిగిన సందర్భాల్లోనూ భారత్ శాంతి వైపే నిలిచిందే తప్ప ఏ పరిస్థితుల్లోనూ హింసను సమర్థించలేదు. ఎవరి వత్తిడులకు తలొగ్గకుండా ఎనలేని మనోధైర్యంతో నిలబడి శాంతివైపే మొగ్గింది. ఇప్పుడు కూడా అదే జరిగింది. యుద్ధాల ద్వారా సాధించేదేమీ ఉండదని, లోకకల్యాణం జరగాలంటే శాంతితోనే సాధ్యమని మరోసారి భారత్ ధైర్యంగా చాటింది. ఉక్రెయిన్‌లోని బుచా నగరంలో జరిగిన హింసాకాండపై స్వతంత్ర దర్యాప్తు చేపట్టాలనే డిమాండ్‌కు మద్దతును ప్రకటించడం ద్వారా, రష్యా తనకు మిత్రదేశమైనా సరే..హింసాకాండలకు భారత్ వ్యతిరేకమనే విషయాన్ని ప్రపంచానికి మరోసారి తేల్చిచెప్పినట్లయింది. లోక్‌సభలో చర్చ సందర్భంగా జైశంకర్ మాట్లాడుతూ బుచా హింసాకాండ దారుణమని, రక్తం చిందించడం ద్వారా, అమాయకుల ప్రాణాలను పణంగా పెట్టడం ద్వారా సమస్యలకు ఎలాంటి పరిష్కారం లభించదని, చర్చలు మాత్రమే హింసలకు ముగింపు పలుకుతాయని చెప్పడం.. భారత్ శాంతియుత తత్వానికి, సహజ మానవీయ జీవన విధానానికి నిలువెత్తు నిదర్శనం. మరో సందర్భంలో ప్రధాని మోడీ కూడా తనదైన శైలిలో ఇదే విషయం స్పష్టం చేశారు.

'ప్రపంచం మొత్తం రెండు వర్గాలుగా విడిపోయినప్పుడు... భారతదేశం మానవత్వం గురించి దృఢంగా మాట్లాడగల దేశంగా నిలబడింది' ప్రధాని మోడీ అనడం.. ఎంత గొప్ప మాట!... ప్రపంచంలోని అన్ని దేశాల ప్రాదేశిక సమగ్రత, సార్వభౌమత్వాలను గౌరవించాలన్న తత్వం భారత్‌ది. ఆ మాటే ఎప్పటినుంచో చెప్తోంది.. ఎప్పటికీ చెప్తుంది కూడా. 'లోకోస్సమస్తా సుఖినో భవన్తు!..అంటూ లోకమంతా సుఖంగా ఉండాలని ఆకాంక్షించే తత్వం, విశ్వశాంతిని కోరుకునే మానవీయ మనస్తత్వం భారతదేశానిదన్న విషయం ఈ సందర్భంగా మరోసారి ప్రపంచానికి చెప్పినట్లయింది.

అయినా.. అసలే ఒకవైపు కరోనా రాకాసి విలయతాండవం చేస్తూ ప్రపంచ మానవాళిని పీక్కుతింటుంటే, అనేకదేశాల ఆర్థికస్థితిగతులన్నీ ధ్వంసమైపోతుంటే.. కనిపించని ఆ సూక్ష్మక్రిమికి భయపడి గడప కూడా దాటలేక పలుదేశాల్లో ప్రజలు భయపడి చస్తుంటే.. మధ్యలో ఈ భీకర యుద్ధాలేమిటి?.. ఈ దారుణ మారణకాండలేమిటి?.. కరోనా ఇంకా రకరకాల రూపాలతో వస్తూనే ఉంది. చేయాల్సిన యుద్ధమేదైనా ఉందంటే కరోనా తోనే. దాన్ని వదిలేసి సాటి మనుషులపై ప్రతాపమేమిటి?.. మనిషికి కావాల్సింది అన్నవస్త్రాలు కానీ, అణ్వస్త్రాలు కాదన్న విషయం తెలియనిదెవరికి?..ఎన్నో పేద దేశాలు, చిన్న దేశాల్లో..కోట్లాదిమంది నిరుపేదలు నిస్సహాయులుగా జీవిస్తున్నారు. సాటిమానవులెంతోమంది కష్టాలతో అల్లాడిపోతుంటే, పెద్దదేశంగా ఉన్నవాళ్ళు మేమున్నామంటూ పెద్దరికంతో ముందుకువచ్చి అందరికీ రక్షగా నిలవాల్సింది పోయి..తామే భక్షకులుగా మారితే ఎవరికి చెప్పుకోవాలి?.. ఎన్నో యుద్ధాలు..ఎన్నో విధ్వంసాలు ప్రపంచంలో ఇప్పటికే ఎన్నో జరిగాయి.. చివరికి ఏం సాధించగలిగాం?.. యుద్ధాలతో చివరికి బావుకునేదేముంటుంది?.. శవాలతో నిండిన స్మశానాలను ఏలుకోవడం తప్ప!.. ఇప్పటికైనా ఆ తీరు మారాలి. చర్చలతోనే సమస్యలను పరిష్కరించుకోవాలి. కారణాలెన్నయినా ఉండొచ్చు గాక.. యుద్ధాలతో చివరికి సాధించేదేమీ ఉండదని చరిత్ర చెప్తున్న సత్యం. దేశమేదైనా సరే..మానవ వినాశానికి కాక..మానవ కల్యాణానికి బాటలు వేయాలి!..అప్పుడే మానవుడు మహనీయుడవుతాడు!..

'రెండు దేశాల మధ్య యుద్ధంలో భారత్ ఎటువైపు ఉంటుందన్న ప్రశ్నకు ఎటూ తొణకకుండా 'శాంతి వైపు' అని భారత విదేశాంగమంత్రి జైశంకర్ పార్లమెంట్‌లో స్పష్టంగా చెప్పడం అందరినీ మంత్రముగ్ధులను చేసింది. ఎందుకంటే, ఇది శాంతిదూత.. జాతిపిత మహాత్మాగాంధీజీ పుట్టినిల్లు. శాంతికి-అహింసకు నిలయం భారతదేశం. ఇప్పుడే కాదు.. గతంలో కూడా.. ప్రపంచంలో పలు యుద్ధాలు జరిగిన సందర్భాల్లోనూ భారత్ శాంతివైపే నిలిచింది తప్ప ఏ పరిస్థితుల్లోనూ హింసను సమర్థించలేదు. కీలకమైన సందర్భాల్లోనూ మనోధైర్యం కోల్పోలేదు. అందుకే 'దటీజ్ భారత్' అని ప్రపంచమంతా భారత్‌ను సగౌరవంగా చూస్తోంది.

## మురుగుదిబ్బగా.. నగరం



నెల్లూరు నగరాన్ని సుందరనందన వనంగా తీర్చి దిద్దుతామని నాయకులు, అధికారులు ఎంతోకాలంగా నగర ప్రజలను మాయమాటలతో మభ్యపెడుతూనే ఉన్నారు కానీ ఆచరణకు వచ్చేసరికి నగరం సమస్యల నిలయంగానే ఉంది. పారిశుద్ధ్యం, పరిశుభ్రతల గురించి ఊక దంపుడు మాటలే తప్ప మురుగుగబ్బు

### సమస్యల తో 'రణం'

నుంచి నగరాన్ని కాపాడే నాథుడు మాత్రం కనిపించడం లేదు. నగర వీధులు చెత్తా చెదారంతో పేరుకుపోతున్నా, సైడు కాలువలను ఎప్పటికప్పుడు పూడిక తీసే వారు లేక పరిసరాలన్నీ గబ్బుకొట్టి పోతున్నా పట్టించుకునే దిక్కు లేదు. ఇవన్నీ రోజూఉండే సమస్యలేగా అన్నట్లు ఎవరికి వారు కాలం గడిపేస్తున్నారే తప్ప ప్రజారోగ్యం ఎవరికీ పట్టడం లేదు. ఎంతమంది నాయకులు వచ్చినా, అధికారులు మారుతున్నా అందరిదీ ఒకే మాట.. ఒకేబాట అన్నట్లుగా ఉంటుంది. నెల్లూరును 'స్వచ్ఛ నెల్లూరు'గా చేసేస్తామని, పరిశుభ్రతలో నెంబర్-వన్ అనిపిస్తామని సభలు, సమావేశాల్లో గొప్పలు చెప్తుంటారే తప్ప ఆ తర్వాత ఎవరూ అడ్రస్ ఉండడం లేదు. ప్రభుత్వాలు మారినా పాలకులు మారినా ప్రజల తలరాతలు మాత్రం మారడం లేదనే ఆవేదనకు నెల్లూరే ఒక శాశ్వత నిదర్శనం!.. ఇంకా ఎంతకాలానికి ఈ దుస్థితి మారుతుందో ఏమో!.. ఏలిన వారికే తెలియాలి!...

-సంచారి

## ఇళ్ళ నిర్మాణాలను సత్వరం పూర్తిచేయాలి

'నవరత్నాలు- పేదలందరికీ ఇల్లు' పథకంలో భాగంగా ప్రభుత్వం నిర్మిస్తున్న ఇళ్లకు సంబంధించి ఈ నెలాఖరులోపు ప్రతి ఇల్లు పునాది స్థాయి దాటి పనుల్లో పురోగతి కనిపించాలని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు గృహనిర్మాణశాఖ అధికారులను ఆదేశించారు. ఈనెల 12వతేదిన నెల్లూరురూరల్ మండలం కొత్తూరు సమీపంలోని అక్కచెరువుపాడు జగనన్న కాలనీని కలెక్టర్ పరిశీలించారు. అక్కచెరువుపాడు లే-అవుట్‌లో 237 ఇళ్లకుగాను 80 ఇళ్లకు పునాది స్థాయి వరకు పనులు పూర్తయ్యాయని, మరింత వేగంగా పనులు చేపట్టి ప్రతి ఇల్లు బేస్మెంట్ స్థాయి దాటేలా అధికారులు పనిచేయాలని కలెక్టర్ సూచించారు.

## పొట్టేపాళెం కోదండరామునికి ముత్యాల కిరీటాలు



శ్రీరామనవమి పర్వదినాల సందర్భంగా నెల్లూరు రూరల్‌లోని పొట్టేపాళెం గ్రామంలో వెలసివున్న శ్రీ కోదండరామస్వామివారి దేవస్థానంలో ఈనెల 10 నుంచి వైభవంగా బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. ఈనెల 22వ తేది వరకు జరగనున్న ఈ ఉత్సవాల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివార్లను దర్శించుకుంటున్నారు. ఈ సందర్భంగా చెన్నారెడ్డి కృష్ణారెడ్డి జ్ఞాపకార్థం వారి మనుమళ్ళు చైతన్యరెడ్డి, సాయికుమార్‌రెడ్డిలు ఈనెల 10న స్వామి వార్లకు సుమారు 80వేల రూపాయల విలువచేసే ముత్యాల కిరీటాలు, సీతమ్మవారికి జడ, రెండు వింజామరలతో పాటు ఆలయానికి రెండు ఫ్యాన్లను వితరణగా అందజేశారు. ఆలయ ట్రస్ట్‌బోర్డు ఛైర్మన్ పొన్నాల రామచంద్రారెడ్డి, ఇఓ పెంచలప్రసాద్, ధర్మకర్తలు సండి మల్లికార్జున, చెన్నారెడ్డి సునీల్‌రెడ్డి, కొప్పాల సురేష్, చేకోరి పెంచలయ్య పాల్గొన్నారు.

## పెట్రో వాత - ధరల మోత
## వినిపించని భాజపా, జనసేనానిల కూత...!

'పన్నుల రూపంలో ప్రజలను దోచుకుంటున్న ఈ ప్రభుత్వాన్ని గద్దె దింపేవరకూ నిదురపోము'... అంటూ ఆంధ్రాలో వైసీపీ ప్రభుత్వంపైకి ఒంటికాలిమీద లేస్తున్నాయి బీజేపీ, జనసేన పార్టీలు. గతంలో ఎన్నడూ లేనంతగా రికార్డు స్థాయిలో పెట్రోలు, డీజిల్ ధరలు పెరుగుతుంటే మాత్రం కుయ్... కయ్ మనడంలేదు. భారీగా చమురు ధరలు పెరగడంతో అంతేస్థాయిలో రవాణా ఛార్జీలు పెరిగాయి. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. రవాణాతో ముడిపడి ఉన్న అన్ని రంగాల రేట్లు అమాంతం పెరిగి సామాన్యులపై పెనుభారాన్ని మోపుతున్నాయి. అస్తమానము జగన్ ప్రభుత్వ పాలనపై తప్పులు చూపిస్తూ నిప్పులు చిమ్ముతున్న కమలనాథులకి, జనసైన్యానికి పెరుగుతున్న ధరలు, అందుకు కారణమైన కేంద్ర ప్రభుత్వం కనిపించడం లేదు. రాష్ట్రంలో తాము అధికారంలోకి వస్తే ఉద్ధరిస్తామని చెబుతున్న భాజపా శ్రేణులు కేంద్రంలో అధికారంలో ఉన్న తమ పార్టీ పెద్దలను ముందుగా నిలదీస్తే బాగుంటుంది. వంట గ్యాస్ కొనాలంటే మండిపోతుంది. ఒక ఇంట్లో ఇద్దరు కష్టపడితే నెలకు 8 వేలో 10 వేలో సంపాదించే కుటుంబానికి వెయ్యి రూపాయలకుపైగా ఖర్చుచేసి వంట గ్యాసు కొనుక్కోవాలంటే ఎంత కష్టమో ఈ రాజకీయ నాయకులకు తెలియనిదేమీ కాదు. ఎంతసేపటికి తాము అధికారంలోకి వస్తే అదిచేస్తాం.. ఇది చేస్తాం అనే ప్రగల్భాలు మానేసి కేంద్రంలో అధికారం వెలగబెడుతున్న పార్టీకి చెందిన రాష్ట్ర నాయకులు, ఆ పార్టీతో దోస్తీ చేస్తున్న జనసైనికులు ముందుగా కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించినప్పుడే రాష్ట్ర ప్రభుత్వ విధానాలను తప్పుబట్టే నైతిక హక్కు పొందుతారు.

**ఎం.వి.ఎస్.రెడ్డి, కావలి.**




## 'మనలోమాట' బాగుంటుంది..!


మన 'లాయర్'లో గత కొన్ని నెలలుగా ప్రతివారం సీనియర్ పాత్రికేయుడు భోగాది వేంకటరాయుడు రాస్తున్న 'మనలో మాట' చాలా బాగుంటుంది. రెండు తెలుగు రాష్ట్రాలలో జరుగుతున్న అనేక సంఘటనలను, రాజకీయాలలో వస్తున్న పెను మార్పులను, ప్రభుత్వాలు తీసుకుంటున్న కొన్ని సంచలనాత్మక నిర్ణయాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ 'మనలోమాట'లో ఆయన చర్చిస్తున్నారు. ముఖ్యంగా గత వారం పత్రికలో ఆంధ్రలో కొత్తగా ఏర్పడ్డ 26 జిల్లాలపై 'జయహో జగన్' అంటూ ఆయన విశ్లేషించిన తీరు ఆలోచింప చేస్తుంది. ఆయన చర్చించినట్లుగా జిల్లాల పునర్విభజన చరిత్రాత్మక ఘట్టం. ఆయన చెప్పినట్లుగా, పునర్విభజనతో కేవలం పాలనా సౌలభ్యంలో మార్పు వస్తుంది తప్ప పాలనా విధానంలో మార్పు రాదన్నమాట నిజం. జిల్లాల వికేంద్రీకరణతో ప్రజల జీవన విధానంలో మార్పు వచ్చిందా...? విభజనకు ముందు.. విభజన తరువాత అన్న తేడా కనపడుతుందా అన్న విషయంలో కూడా ప్రభుత్వం గమనించాలి. అందుకు అనుగుణంగా అధికార వ్యవస్థ పనితీరులో మార్పు తీసుకురావాలి. అలా జరిగిన రోజున జగన్‌మోహన్‌రెడ్డి చేసిన జిల్లాల పునర్విభజన ప్రక్రియకు సార్థకత చేకూరుతుంది. భోగాది రాయుడుకి అభినందనలు...!

**పి.లక్ష్మీరెడ్డి, హైదరాబాదు.**

## గాడితప్పిన పోస్టల్ శాఖ!

మన దేశంలో పోస్టల్ శాఖ గాడి తప్పినట్లుగా కనిపిస్తోంది. ఒకప్పుడు చిన్న కార్డు ముక్క రాసినా మోసుకొచ్చి అందించేది తపాలా శాఖ. ఆ శాఖ ఉద్యోగులు ఎంతో బాధ్యతగా వ్యవహరించేవారు. ఇ - మెయిల్, వాట్స్ అప్ వంటి ఇంటర్నెట్ ఆధారిత వ్యవస్థలతో పాటు కొరియర్ సర్వీస్ వచ్చిన తరువాత తపాలా శాఖ ప్రాముఖ్యత తగ్గింది. అందుకు తగ్గట్లుగా ఆ శాఖ ఆదాయం కూడా గణనీయంగా పడిపోయింది. అయినప్పటికీ పోస్టల్ డిపార్ట్‌మెంట్ సిబ్బంది చాలావరకూ అంకిత భావంతోనే పనిచేసేవారు. అయితే కరోనా మహమ్మారి ప్రపంచాన్ని అతలాకుతలం చేసిన తరువాత తపాలా శాఖ కూడా గాడి తప్పినట్లు అనిపిస్తోంది. కేవలం స్పీడ్ పోస్టులు, రిజిస్టర్ పోస్టులు వంటి ఆదాయ అవకాశాలు ఉన్న సేవలు తప్ప సాధారణ తపాలా సేవలు అందించ డానికి విముఖత చూపిస్తుందా అనిపిస్తోంది. తపాలాలో ఇంతకముందు క్రమం తప్పకుండా వచ్చే అనేక వార్తా పత్రికలూ, సేవా సంస్థల సమాచారాలు, ఉత్తరాలు ఇప్పుడు సరిగ్గా అందడంలేదు. సైకిలుపై ఇంటింటికీ తిరిగే పోస్ట్‌మ్యాన్ వీధుల్లో కనపడడం లేదు. సామాన్యులకు తపాలా శాఖ కూడా దూరమవుతుందా...? అన్న అనుమానం కలుగుతోంది.

**రాణి భరద్వాజ్, నెల్లూరు.**



## గౌరవపూర్వక కలయిక

రాజ్యసభ సభ్యులు వేణుంబాక విజయసాయిరెడ్డిని ఇటీవల ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ మరియు సహకార, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, పక్కన వైకాపా రాష్ట్ర నాయకులు పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి కూడా ఉన్నారు.

# శ్రీసిటీలో 'డైకిన్'కు శంకుస్థాపన

- 1000 కోట్ల పెట్టుబడులతో.. ఇక భారీగా ఏసీల తయారీ
- మరో 3వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కన్వాల్‌జీత్ జావా

*దేశంలో డైకిన్–ఇండియా మరో ఉత్పత్తి కేంద్రానికి అంతర్జాతీయ ఖ్యాతిగాంచిన శ్రీసిటీలో ఇటీవల శంకుస్థాపన జరిగింది. జపనీస్ బహుళజాతి ఎయిర్ కండిషనింగ్ తయారీ కంపెనీ డైకిన్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ అనుబంధ సంస్థ డైకిన్ ఎయిర్ కండిషనింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ నూతన పరిశ్రమ నిర్మాణానికి శ్రీకారం చుట్టడంతో ఇక ఏసీల తయారీలో శ్రీసిటీ మరో ముందడుగు వేసినట్లే. ఇది దక్షణ భారతదేశంలోనే మొదటిది కావడమే కాక, మనదేశంలో ఆ సంస్థకు చెందిన మూడవ ఉత్పత్తి కేంద్రం కావడం విశేషం.*

అంతేకాదు, దేశంలోని అనుకూలమైన పారిశ్రామిక విధానాలు, సాహసోపేతమైన ప్రభుత్వ సంస్కరణలు, సులభంగా వ్యాపారం చేయడం వంటి అనుకూలతల దృష్ట్యా, డైకిన్ ఇండియా రాబోయే రెండు మూడు సంవత్సరాలలో గణనీయమైన పెట్టుబడి పెట్టేందుకు మొదటి అడుగు వేసింది. డైకిన్ యొక్క శ్రీసిటీ ప్లాంట్ దాని అత్యాధునిక దేశీయ ఉత్పత్తులతో జాతీయ, అంతర్జాతీయ మార్కెట్‌లకు సేవలు అందించనుండడం శుభపరిణామం. భారత్‌లోని జపాన్ రాయబారి సతోషి సుజుకీ, చెన్నైలోని జపాన్ కాన్సుల్ జనరల్ మసయుకి టాగా, ఫ్యుజిత సీనియర్ మేనేజింగ్ డైరెక్టర్ నయోకి నిషియొక, శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తదితరుల సమక్షంలో డైకిన్ ఇండియా ఎం.డి, సీఇఓ కన్వాల్‌జీత్ జావా, జెట్రో, జైకా మరియు శ్రీసిటీ జపాన్ పరిశ్రమల ప్రతినిధుల సమక్షంలో డైకిన్–ఇండియా ఏసీల తయారీ 3వ యూనిట్‌కు శంకుస్థాపన జరిగింది. ఈ సందర్భంగా జావా మాట్లాడుతూ, తమ ప్రపంచవ్యాప్త వినియోగదారులకు ఉత్తమ సేవలందించేందుకు అవసరమైన గ్లోబల్ మ్యానుఫ్యాక్చరింగ్ వ్యవస్థను విస్తరించడం, సమతుల్యం చేయడం లక్ష్యంగా సంస్థ దీర్ఘకాలిక వృద్ధి వ్యూహంలో(ఫ్యూజన్ 2025) ఇది చాలా ప్రాధాన్యత సంతరించుకుందన్నారు. జపనీస్ పరిశ్రమలకు కావలసిన అన్ని వ్యాపారానుకూలతలు ఉన్న అద్భుత ప్రదేశం శ్రీసిటీ అంటూ ఆయన ప్రశంసించారు. తమకు సహాయసహకారాలు అందించిన శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఇతర శ్రీసిటీ సిబ్బందికి అభినందనలు తెలిపారు.

### రానున్న అయిదేళ్లలో 3 లక్షల కోట్ల జపాన్ పెట్టుబడులు లక్ష్యం :

డైకిన్ ఇండియా పరిశ్రమ శంకుస్థాపన కార్యక్రమం జపాన్–ఇండియా ఆర్థిక భాగస్వామ్యానికి మరో ముందడుగని ఈ కార్యక్రమంలో పాల్గొన్న భారత్‌లోని జపాన్ రాయబారి సతోషి సుజుకీ అన్నారు. గత నెలలో జపాన్, భారత్ ప్రధానుల మధ్య జరిగిన సమావేశంలో రెండు దేశాల ఆర్థిక, వాణిజ్య సంబంధాలు పెద్ద ఎత్తున బలపడేందుకు పరస్పర అంగీకారం కుదిరిందన్నారు. రానున్న ఐదేళ్ళలో 3 లక్షల కోట్లు జపాన్ పెట్టుబడులు భారత్‌కు రావాలని లక్ష్యంగా నిర్దేశించడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా నేడు డైకిన్ ఇండియా తొలి అడుగు వేసిందన్నారు.

### ఇదెంతో చరిత్రాత్మకం - శ్రీసిటీ ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి

ప్రపంచలో నెంబర్ వన్ జపనీస్ ఎయిర్ కండిషనింగ్ కంపెనీ డైకిన్ గ్రూప్‌ను, దేశంలో ఈజ్ ఆఫ్ డూయింగ్‌లో నెంబర్ వన్‌గా ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి స్వాగతిస్తున్నామని, ఇదొక చరిత్రాత్మకమైన విషయమని శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి అభివర్ణించారు. కోవిడ్ అనంతరం అధికారికంగా, పెద్దఎత్తున నిర్వహించిన పరిశ్రమ భూమిపూజ కార్యక్రమం ఇదేనని ఆయన తెలిపారు. ప్రపంచ ప్రామాణిక మౌళిక సదుపాయాలతో దక్షిణ భారతదేశంలో డైకిన్ తన మొదటి తయారీ స్థావరాన్ని శ్రీసిటీలో ఏర్పాటుచేయడం తమకు గర్వకారణమన్నారు. శ్రీసిటీ జపనీస్ ఎనక్లేవ్‌లో ఇది 27వ జపనీస్ కంపెనీ అని, ఈ సంవత్సరం శ్రీసిటీలో అడుగుపెట్టిన మొదటి భారీ పరిశ్రమ డైకిన్ కావడం సంతోషదాయకమన్నారు. దీని ద్వారా సుమారు 3000 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. శ్రీసిటీలోని జపాన్–ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఫర్ మాన్యుఫ్యాక్చరింగ్‌కు సాంకేతిక నైపుణ్య శిక్షణ తోడై ఈ ప్రాంతంలోని స్కిల్డ్, అన్ స్కిల్డ్ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు విరివిగా లభిస్తాయని అన్నారు.

### వెయ్యి కోట్ల పెట్టుబడితో డైకిన్ ఉత్పత్తులు

శ్రీసిటీలో సుమారు 75.5 ఎకరాల స్థలంలో డైకిన్ ప్లాంట్‌ను నెలకొల్పనున్నారు. డైకిన్ సంస్థ రెండు మూడు సంవత్సరాలలో రూ. 1,000 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. జూలై 2023 నాటికి ఈ ప్లాంట్ ఉత్పత్తులు ప్రారంభం అవుతాయని భావిస్తున్నారు. తద్వారా 3000 మందికి ఉద్యోగాలు లభించనున్నాయని అంచనా. సంవత్సరానికి 1.5 మిలియన్ ఏసీ యూనిట్లతో పాటు కంప్రెషర్లు, కంట్రోలర్ బోర్డులు, ఇతర విడిభాగాలను తయారు చేయగల సామర్థ్యాన్ని ఈ ప్లాంట్ కలిగి ఉంటుందని రవీంద్ర సన్నారెడ్డి పేర్కొన్నారు.



### న్యూఢిల్లీలో...

# టిటిడి స్థానిక సలహామండలి ప్రమాణస్వీకారం

తిరుమల తిరుపతి దేవస్థానాల స్థానిక సలహామండలి ప్రమాణస్వీకారోత్సవం ఇటీవల న్యూఢిల్లీలోని శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో జరిగింది. టిటిడి ధర్మకర్తల మండలి అధ్యక్షులు వైవి.సుబ్బారెడ్డి, న్యూఢిల్లీ స్థానిక సలహామండలి అధ్యక్షురాలు శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. ఉపాధ్యక్షుడితో పాటు ఇతర సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు.


ప్రమాణస్వీకారం చేసిన వారిలో ఉపాధ్యక్షుడు వై.గంగారావు, సభ్యులు వినోద్ సిన్హా, టి.విజయ్‌రాఘవ్ మూర్తి, సంజీవ్‌రావు, సంజీవ్‌నందా, ఆర్‌ఎల్.శాలి, ఆర్.సదానందరెడ్డి, ఎన్.నాగసత్యం, చంద్రశేఖరరావు, బి.మహేష్‌కుమార్, లలిత్ భాసిన్, కెపి.సుందర్‌రావు, జయకుమార్ భరద్వాజ్, దినేష్‌కుమార్, బి.మదనమోహన్ రెడ్డి, అనిల్‌కపూర్, ఎ.కృష్ణమోహన్, సబితారెడ్డి రామిరెడ్డి, ఆచార్య గీతాసింగ్, ఆచార్య యోగేష్‌సింగ్, ఆచార్య సి.షీలారెడ్డి, జెవి.రామమూర్తి ఉన్నారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఏఇఓ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

### పెన్నా సిమెంట్స్ సౌజన్యంతో...

# ముత్తుకూరులో.. చల్లని మజ్జిగ చలివేంద్రం




పెన్నా సిమెంట్స్ యాజమాన్యం సౌజన్యంతో శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా ఇటీవల ముత్తుకూరు పోలీస్‌స్టేషన్ వద్ద చల్లని మజ్జిగ, మంచినీటి చలివేంద్రం ఏర్పాటైంది. కృష్ణపట్నం–ముత్తుకూరు ఎస్ఐ శివ కృష్ణారెడ్డి కోరిక మేరకు ఈ వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు పోలీసులు ఇక్కడ చలివేంద్రం ఏర్పాటు చేశారు. కనీసం రెండు నెలల పాటు ఈ చలివేంద్రంలో మజ్జిగ, మంచినీటిని తమ సంస్థ సహకారంతో సమకూరుస్తున్నామని పెన్నా సిమెంట్స్ ప్రజా సంబంధాల అధికారి(పిఆర్ఓ) వైఎల్ దీపక్‌రెడ్డి తెలియజేశారు.



8వ వర్ధంతి

మానవత్వానికి ప్రతిరూపంలా నిలిచారు, దాతృత్వంతో అందరి మనసులు గెలిచారు,
శ్రమించే తత్వానికి ప్రతిబింబం మీరు... మంచిని పంచే వ్యక్తిత్వానికి పెట్టింది మీ పేరు.
మా ఉన్నతికి బాటలువేసి, మా బంగారు భవిష్యత్‌కు మార్గదర్శకులుగా నిలిచిన మా ఇంటి దైవం

కీ॥శే॥ చెరుకుపల్లి పిచ్చిరెడ్డి గారు

అధినేత: సిపిఆర్ కళ్యాణ మండపం, శివప్రియ లాడ్జి

పరమపదించి తేది.18.04.2022 నాటికి ఎనిమిదేళ్ళు గడుస్తాయి.

వారి దివ్యస్మృతికి మా నివాళులు.

భార్య: సుబ్బరత్నమ్మ

కుమారుడు - కోడలు: చెరుకుపల్లి పద్మనారాయణరెడ్డి - సుమతి

మనుమలు: హరీశ్వర్‌రెడ్డి - సుస్మిత భువనేశ్వర్‌రెడ్డి

మరియు బంధుమిత్రులు

# జిల్లాలో 53 పోలీస్‌స్టేషన్లు

## - గెజిట్ విడుదల

జిల్లా పునర్వ్యవస్థీకరణలో భాగంగా నెల్లూరుజిల్లాకు కేటాయించిన పోలీస్‌స్టేషన్లపై ఈనెల 11న ప్రభుత్వం గెజిట్‌ను విడుదల చేసింది. నెల్లూరుజిల్లాకు 49 పోలీస్‌స్టేషన్లు, దిశ పోలీస్‌స్టేషన్‌తో పాటు, సిసిఎస్, ట్రాఫిక్ నార్త్-సౌత్ పోలీస్‌స్టేషన్లు.. మొత్తం 53 పోలీస్‌స్టేషన్లను ఇందులో కేటాయించడం జరిగింది. ప్రకాశం జిల్లా నుంచి కందుకూరు టౌన్, రూరల్, ఉలవపాడు, గుడ్లూరు, ఓలేటివారిపాళెం, లింగసముద్రం పోలీస్‌స్టేషన్లు కూడా నెల్లూరుజిల్లాలో కలిశాయి.

# ఇంధన పొదుపులో.. నెల్లూరు ఆర్టీసి భేష్

ఇంధన పొదుపులో రాష్ట్రంలోనే నెల్లూరు రీజియన్ ముందంజలో ఉందని ఆర్టీసి నెల్లూరు జోన్ ఇ.డి గోపీనాథ్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. ఈనెల 11న ఆయన నెల్లూరులోని ఆర్టీసి 1వ డిపో గ్యారేజ్‌లో ఇంధన పొదుపు వారోత్సవాలు ప్రారంభించారు. ప్రస్తుతం డీజిల్ ధరలు భారీగా పెరుగుతున్న నేపథ్యంలో ఇంధన పొదుపు ఆవశ్యకతను ఆయన డ్రైవర్లకు వివరించారు. ఆర్ఎం శేషయ్య, డెప్యూటీ సిఎంఇ ఇబ్రహీం, ఓఎస్డీ రవికాంత్, సిటిఓ చిరంజీవి, డిపో మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

# వేతన బకాయిలు ఇప్పించండి

## - కలెక్టర్‌కు వినతి

తమకు రావాల్సిన వేతన బకాయిలు ఇప్పించండంటూ నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోను, వైద్యకళాశాలలోను పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, సెక్యూరిటీ సిబ్బంది కలెక్టర్ చక్రధర్‌బాబుకు విజ్ఞప్తిచేశారు. ఈనెల 11న ఏపి మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకుల సారధ్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. సెక్యూరిటీ సిబ్బందికి 2019 సంవత్సరంలోని అక్టోబర్, నవంబరు, డిసెంబరు నెలల వేతనాలు నేటికీ చెల్లించలేదని, తాజాగా మూడు నెలల నుంచి వేతనాలు ఇవ్వడం లేదని వారు కలెక్టర్ వద్ద వాపోయారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు సతీష్‌కుమార్, సిఐటియు నాయకులు కుమార్, సందాని బాషా, రామాంజనేయులు, శామ్యూల్ పాల్గొన్నారు.

# మలేరియా అధికారిగా హుస్సేనమ్మ

జిల్లా మలేరియా నివారణ అధికారిగా కడప నుంచి బదిలీపై వచ్చిన హుస్సేనమ్మ ఈనెల 11న నెల్లూరులో బాధ్యతలు తీసుకున్నారు. తొలుత డిఎంఅండ్‌హెచ్‌ఓ రాజ్యలక్ష్మిని ఆమె మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. జిల్లాలో మలేరియా, డెంగ్యూ తదితర వ్యాధుల నివారణకు గట్టిగా కృషి చేస్తామని ఆమె చెప్పారు.

# 27 నుంచి టెన్త్ పరీక్షలు

## పకడ్బందీగా ఏర్పాట్లు

ఈనెల 27వ తేది నుంచి మే నెల 7వ తేది వరకు పదవ తరగతి పరీక్షలు జరుగనున్న నేపథ్యంలో, జిల్లాలో పరీక్షల నిర్వహణ కోసం అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇటీవల జిల్లా రెవెన్యూ అధికారి (డిఆర్ఓ) నారాయణమ్మ నగరంలోని తన ఛాంబర్‌లో అధికారులతో సమావేశమై ఏర్పాట్లను సమీక్షించారు. జిల్లాలో మొత్తం 33,567 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని, వారి కోసం 245 పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేస్తున్నామని, పరీక్షల సమయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సంబంధిత అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. డిఇఓ రమేష్, ఆర్డీఓ సుశీల, విద్యుత్ ఇఇ బాలచందర్, వైద్యాధికారి భాస్కర్, స్పెషల్ బ్రాంచ్ అధికారి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# పెద్దాసుపత్రిలో మెరుగైన వసతులు

నెల్లూరు పెద్దాసుపత్రిలో రోగులకు మేలైన వసతులు కల్పిస్తున్నామని, ఈ వేసవి కాలంలో నీటి ఇబ్బందుల నివారణకు జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు 6లక్షల రూపాయలు మంజూరు చేశారని ఆసుపత్రి అభివృద్ధి కమిటీ కో-ఆర్డినేటర్ లక్ష్మీసునంద చెప్పారు. ఈనెల 12న ఆమె పెద్దాసుపత్రిలో విలేకరులతో మాట్లాడుతూ ఆపరేషన్ థియేటర్లలో కొత్త ఏసీలు బిగించామన్నారు. లయన్స్ క్లబ్ సహకారంతో కోటి రూపాయల వ్యయంతో కిడ్నీ డయాలసిస్ యూనిట్ మంజూరైందని, త్వరలోనే ఏర్పాటు చేస్తామని తెలిపారు. కమిటీ సభ్యులు బ్రహ్మానందరెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

# నెల్లూరు కబుర్లు

# మహనీయుడు.. మహాత్మా జ్యోతిరావు పూలే

సమసమాజ స్థాపనకు సామాజిక చైతన్యాన్ని తీసుకువచ్చి సమాజంలో నెలకొనివున్న రుగ్మతలను పారద్రోలాడానికి ఎంతో కృషిచేసిన మహనీయులు మహాత్మా జ్యోతిరావ్ పూలే అని జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు కొనియాడారు. మహాత్మా జ్యోతిరావు పూలే 196వ జయంతి సందర్భంగా సోమవారం నెల్లూరు నగరంలోని మినీబైపాస్ వద్ద ఉన్న పూలే విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి చివరిశ్వాస వరకు కృషిచేసిన జ్యోతిరావుపూలే ఆదర్శాల బాటలో అందరూ పయనించాలన్నారు. జాయింట్ కలెక్టర్ హరేందిరప్రసాద్, రాష్ట్ర బొందిలి సంక్షేమాభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మెన్ కిశోర్ సింగ్, రాష్ట్ర ముస్లిం సంచార జాతుల సంక్షేమాభివృద్ధి కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ ఆసిఫా, బి.సి కార్పొరేషన్ ఇడి బ్రహ్మానందరెడ్డి, డిఎస్‌డబ్ల్యుఓ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# జ్యోతిరావు పూలే సేవలు చిరస్మరణీయం

## - కొనియాడిన బార్ అసోసియేషన్



మహాత్మా జ్యోతిరావు పూలే 196వ జయంతిని పురస్కరించుకుని నెల్లూరు జిల్లా కోర్టు ఆవరణంలోని న్యాయవాదుల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 11న వందలాదిమంది న్యాయవాదులు పూలే చిత్రపటానికి పూలమాలవేసి ఆయన సామాజిక సేవలను స్మరించుకుని ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ భారతీయ సంఘ సంస్కర్త, సామాజిక తత్వవేత్త, ఉద్యమకారుడైన జ్యోతిరావు పూలే సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆ మహనీయుడు చూపిన బాటలో అందరూ నడవాలని ఆయన ఆకాంక్షించారు. నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు డి.ఫణిరత్నం, జనరల్ సెక్రటరీ రామిరెడ్డి రోజారెడ్డి, ఏపి లాయర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జి.వి.నరసయ్య, దాసరి రాజేంద్రప్రసాద్ తదితర ప్రముఖులు పాల్గొని జ్యోతిరావు పూలే అణగారిన ప్రజల అభ్యున్నతికి చేసిన సేవలను స్మరించుకున్నారు. పెద్దసంఖ్యలో న్యాయవాదులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## డిసిసి ఆధ్వర్యంలో..

సామాజిక ఉద్యమకారుడు, సంఘసంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఈనెల 11న జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి సూచనలతో డిసిసి ఉపాధ్యక్షులు తలారి బాల సుధాకర్ ఆధ్వర్యంలో జోతిరావు పూలేకి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. డిసిసి ప్రధాన కార్యదర్శి, షేక్ హుస్సేన్‌బాషా, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గణేష్, డిసిసి ప్రధాన కార్యదర్శి మోహన్, తలారి మురళి, సల్మాన్, మల్లి, చిన్న, రాజా, అంజి తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో శ్రీ సాయినాధుని నగరోత్సవం




నెల్లూరు బాలాజీనగర్ శివారులో ఉన్న పద్మావతినగర్‌లోని సాయిదర్బార్ అద్దాల మందిరంలో ఈనెల 10న శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా శ్రీ సాయినాధుని నగరోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో వచ్చిన మహిళా భక్తులు ఈ ఉత్సవంలో ఎంతో ఉత్సాహంతో పాల్గొన్నారు. సాయిమాత నిత్యాన్న ప్రసాద నిలయంలో శ్రీ సీతారామచంద్రుల కల్యాణోత్సవం నిర్వహించి వేలాదిగా వచ్చిన భక్తులకు నిర్వాహకులు అన్నప్రసాద వితరణ చేశారు. సాయిబాబా మందిరం మేనేజింగ్ ట్రస్టీ మధుసూదన్‌సాయి, భక్త బృందం పర్యవేక్షించారు.

# నెల్లూరుసీమ కీర్తికిరీటం.. టౌన్‌హాలు

## - సంస్థాపక దినోత్సవంలో జెఎస్ రెడ్డి



నెల్లూరుసీమకే గర్వకారణమైన టౌన్‌హాలు (రేబాల లక్ష్మీనరసారెడ్డి పురమందిరం) 107వ సంస్థాపక దినోత్సవం ఈనెల 10న సందడిగా జరిగింది. టౌన్‌హాలు కమిటీ నిర్వాహకులు, పురమందిర పునర్నిర్మాణ దాత జెఎస్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ సందర్భంగా వేడుకలు జరిగాయి. తొలుత పురమందిర నిర్మాణకర్త, మహాదాత రేబాల లక్ష్మీనరసారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోనే కళాత్మకమైన మందిరంగా ఎంతో ప్రఖ్యాతిచెందిన టౌన్‌హాలుకు 107 వసంతాలు పూర్తయ్యాయని, ఎందరో ప్రసిద్ధ కళాకారులు చరిత్రాత్మకమైన ఈ వేదికపై తమ కళలను ప్రదర్శించి మరింత ప్రఖ్యాతి చెందారని అన్నారు. టౌన్‌హాలులో ప్రదర్శన ఇవ్వడమే ఒక గొప్ప గౌరవంగా కళాకారులు భావించడం టౌన్‌హాలు గొప్పదనానికి నిదర్శనమని, నెల్లూరుసీమ కీర్తికిరీటంగా టౌన్‌హాలు భాసిస్తోందని ఆయన అన్నారు. సాహిత్య కళారంగాలకు ప్రాధాన్యతనిస్తూ నేటికీ పురమందిరం ప్రజలందరి ఆదరాభిమానాలను అందుకుంటోందన్నారు. ఈ సందర్భంగా విశ్రాంత డెప్యూటీ కలెక్టర్ సిహెచ్ పెంచలరెడ్డిని పురమందిరం నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. హాస్యనటుడు దొర్నాల హరిబాబు ఆధ్వర్యంలో విద్యార్థులు, చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆ కళాకారులందరికీ నిర్వాహకులు జ్ఞాపికలిచ్చి సత్కరించారు. టౌన్‌హాలు కమిటీసభ్యులు వాకాటి విజయకుమార్‌రెడ్డి, ఎంవి సుబ్బారెడ్డి, కళాకారులు, కళాభిమానులు, పురప్రముఖులు పాల్గొన్నారు.

# వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



నెల్లూరు మూలాపేటలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానంలో ఈనెల 11వ తేది సాయంత్రం స్వామివారి బ్రహ్మోత్సవాలకు భక్తిశ్రద్ధలతో అంకురార్పణ జరిగింది. ఆలయ అర్చకులు తొలుత స్వామివారి సేనాధిపతి అయిన విష్వక్సేనునికి పూజలు చేసి ఈ ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. ఉభయకర్తలుగా పుట్టా శ్రీనివాసరెడ్డి, వెంకట సౌజన్య దంపతులు వ్యవహరించారు. దేవస్థాన సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి డి.చంద్రశేఖర్‌రావు, ఆలయ ఛైర్మెన్ ముజ్జిగ చంద్రమౌళిరెడ్డి, ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.

# 16న ఎన్నెస్కే స్మారక ఉపన్యాసం



సుప్రసిద్ధ చరిత్రకారుడు నెల్లూరు నగరానికి చెందిన దివంగత నేలనూతల శ్రీకృష్ణమూర్తి (ఎన్నెస్కే) 17వ స్మారక ఉపన్యాసం ఈనెల 16వ తేది శనివారం సాయంత్రం 6.30 గంటలకు నిర్వహిస్తామని స్థానిక వర్ధమాన సమాజం అధ్యక్ష కార్యదర్శులు పొన్నాల రామసుబ్బారెడ్డి, ముజ్జిగ ప్రభాకరరెడ్డిలు ఒక ప్రకటనలో తెలిపారు. టౌన్‌హాలు ప్రాంగణంలోని శ్రీ రేబాల లక్ష్మీనరసారెడ్డి (జూనియర్) సమావేశ మందిరంలో జరిగే ఈ కార్యక్రమంలో సర్వోదయ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డా.కాళిదాసు పురుషోత్తం పాల్గొని ఎన్నెస్కే సారస్వత సేవలను గురించి ఉపన్యసించి సన్మానం స్వీకరిస్తారని, సాహిత్యాభిమానులందరూ విచ్చేసి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు కోరారు.

# వీర సైనికుల కుటుంబాలకు గౌరవ సత్కారాలు

'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్' కార్యక్రమంలో భాగంగా ఈనెల 12న నెల్లూరు నగరంలోని అన్నమయ్య సర్కిల్ వద్ద ఉన్న 24వ ఆంధ్ర ఎన్‌సిసి బెటాలియన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో 24వ ఆంధ్ర ఎన్‌సిసి బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కర్నల్ అవినాష్ చందర్ పాల్గొని యుద్ధంలో వీరమరణం పొందిన ఇరువురి సైనికుల త్యాగాలను కొనియాడుతూ వారి సతీమణులు డి.దానమ్మ, ఎం.కుసుమకుమారిలకు జ్ఞాపికలు అందజేసి గౌరవంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కర్నల్ పికె పాండ్య, మహావీర్, ప్రహ్లాద్, జగన్మోహన్‌రావు పాల్గొన్నారు.



## కాకాణికి ఆత్మీయ సన్మానం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంత్రివర్గంలో నూతనంగా వ్యవసాయ శాఖ మంత్రిగా ఎంపికైన జిల్లా వైకాపా నేత కాకాణి గోవర్ధన్‌రెడ్డిని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, డీసీసీబీ మాజీఛైర్మెన్ ఆనం విజయకుమార్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. ఆయన ప్రమాణస్వీకార మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని అనంతరం విజయవాడలోని నివాసంలో కాకాణిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## పార్టీని గ్రామస్థాయిలో బలోపేతం చేయాలి

### కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న




గ్రామాల్లో వైఎస్సార్సీపిని మరింత బలోపేతం చేయటానికి కార్యకర్తలు కృషిచేయాలని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పార్టీశ్రేణులకు సూచించారు. ఈనెల 12న ఆయన విడవలూరు మండలంలోని రామతీర్థం, రామచంద్రపురం గ్రామాల్లో పార్టీ కార్యకర్తలు, నాయకులు, వాలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేర్చాలసిన బాధ్యత వాలంటీర్లదే అని చెప్పారు. అనంతరం రెండు గ్రామాలకు సంబంధించిన సచివాలయ వలంటీర్లకు శాలువాలు కప్పి సన్మానించి 'సేవా మిత్ర', ' సేవా రత్న', 'సేవా వజ్ర' పురస్కారాలు అందజేసి వలంటీర్ల సేవలను అభినందించారు. రాష్ట్ర ఆప్కాఫ్ ఛైర్మన్ కొండూరు అనిల్‌బాబు, నాయకులు వీరి చలపతిరావు, మండల పార్టీ అధ్యక్షులు బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, కాటంరెడ్డి నవీన్‌రెడ్డి, పూండ్ల అచ్యుత్‌రెడ్డి, జడ్పీటీసీ తుమ్మల లక్ష్మయ్య, ఆవుల వాసు పాల్గొన్నారు.

## జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి నియామకం

జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి (సిపిఓ) గా ఏఎస్ రాజు నియమితులయ్యారు. ఈనెల 11న ఆయన్ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ప్రకాశం జిల్లాకు చెందిన రాజు శ్రీకాకుళంలో ప్రణాళికశాఖ ఏడీగా ఉద్యోగంలో చేరారు. ఆ తర్వాత 2021లో డెప్యూటి డైరెక్టర్‌గా ఉద్యోగోన్నతి పొంది నెల్లూరులో నియమితులయ్యారు. తాజాగా మళ్లీ మరోసారి ఆయనకు ఉద్యోగోన్నతినిస్తూ జిల్లా ముఖ్య ప్రణాళికాధికారిగా ప్రభుత్వం ఆయన్ను నియమించింది.

## ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు

### -- వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి --



ముఖ్యమంత్రి డా. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి ఇంటికీ ప్రజాసంక్షేమ పథకాలు చేరువవుతున్నాయని, తమది ప్రజాసంక్షేమ ప్రభుత్వమని మాజీమంత్రి, వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. ఈనెల 11న దక్కిలి మండల కేంద్రంలోని సచివాలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. దక్కిలి, డి.వడ్డిపల్లి, వెలికల్లు, వెంబులూరు,సంగనపల్లి, మాధవాయపాలెం, లింగసముద్రం సచివాలయాల పరిధిలో అంకితభావంతో ప్రజలకు సేవచేస్తున్న వాలంటీర్లకు ప్రభుత్వం తరపున అవార్డులను బహుకరించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో చేసిన హామీలను, ఎన్నికల హామీలతో పాటు మరెన్నో పథకాలను కూడా ప్రజల కోసం రూపకల్పన గావించి అర్హులైనవారందరికీ సంక్షేమ ఫలాలు అందించాలన్న విశాలదృక్పథంతో వలంటీర్ల వ్యవస్థను..సచివాలయ వ్యవస్థను ప్రారంభించారని ఆయనన్నారు. ఆ తర్వాత దక్కిలి సచివాలయ పరిధిలో 4186 లబ్ధిదారుల ఖాతాలకు నేరుగా 9,76,85,139 రూపాయలు జమచేశారు. అదేవిధంగా డి.వడ్డిపల్లిలోని 1835 మంది లబ్ధిదారులకు 4,28,89,372 రూపాయలు, వెలికల్లులో 2289 మంది లబ్ధిదారులకు రూ. 5,52,01,374, వెంబులూరులో 4243 మంది లబ్ధిదారులకు రూ. 10,48,63,332, సంగనపల్లిలో 3215 మంది లబ్ధిదారులకు, 8,13,48,013 రూపాయలు, మాధవాయపాలెం పరిధిలోని 2217 మంది లబ్ధిదారులకు 5,40,28,714 రూపాయలు, లింగసముద్రంలో 2822 మంది లబ్ధిదారులకు, 6,04,38,469 రూపాయలు మొత్తంగా 7 సచివాలయాల పరిధిలోని 20,807 మంది లబ్ధిదారులకు 49 కోట్లా 64 లక్షల 54 వేలా 413 రూపాయలు జమచేసి ఆయన అందరి అభినందనలు అందుకున్నారు.



## శ్రీ అలఘునాథస్వామి కల్యాణోత్సవం.. మే 12న

ఆత్మకూరు పట్టణంలోని చరిత్రాత్మకమైన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ అలఘునాథ స్వామి దేవాలయంలో అన్ని కైంకర్యాలు మళ్ళీ వైభవంగా జరుగుతున్నాయి. కరోనా మూలంగా రెండేళ్ళుగా ఆలయంలో సేవలకు ఇబ్బందులు ఎదురైనా, ఇప్పుడు యథావిధిగా పూజలు ప్రారంభమయ్యాయి. ఈ దేవాలయాన్ని క్రీ.శ 1247లో నిర్మించినట్లు చరిత్ర. ఈ ఆలయానికి పురాతత్వ శాఖ గుర్తింపు కూడా ఉంది. 2013లో ఈ ఆలయాన్ని జీర్ణోద్ధరణ గావించారు. వైశాఖమాసంలో బ్రహ్మోత్సవాలను కూడా నిర్వహించారు. వచ్చే మే నెల 12వతేదిన స్వామివారి కల్యాణోత్సవాన్ని, 13న నగరోత్సవాన్ని, అదేరోజున అన్నదానాన్ని నిర్వహించేందుకు ఉత్సవకమిటీ వారు సన్నాహాలు చేస్తున్నారు. దాతలు మునుపటిలాగానే తమ సహాయ సహకారాలందించి స్వామివార్ల కృపాకటాక్షాలకు పాత్రులు కావాలని ఉత్సవ కమిటీ వారు, అర్చక స్వామి విజ్ఞప్తి చేస్తున్నారు.







## 19న నెల్లూరులో 'దళిత ప్రతిఘటన సదస్సు'

# విజయవంతం చేద్దాం రండి!

### - టిడిపి శ్రేణులకు సోమిరెడ్డి పిలుపు



రాష్ట్రంలోని వైకాపా ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా టిడిపి ఆధ్వర్యంలో ఇటీవల రైతు ప్రదర్శన, నారీ దీక్ష, ముస్లింల సమరభేరి, జెన్‌కో ప్రైవేటీకరణ వ్యతిరేక పోరు కార్యక్రమాలను విజయవంతం చేసిన తరహాలోనే ఏప్రిల్ 19న నెల్లూరులో దళిత ప్రతిఘటన సదస్సును నిర్వహించాలని నిర్ణయించామని, అందరూ ఈ సదస్సును విజయవంతం చేయాలని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఇటీవల ఆయన నెల్లూరులోని టిడిపి జిల్లా కార్యాలయంలో సర్వేపల్లి నియోజకవర్గ ఎస్సీ నేతలు, ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. నెల్లూరు నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞానభవన్‌లో జరిగే దళిత ప్రతిఘటన సదస్సుకు నియోజకవర్గ నలుమూలల నుంచి భారీగా నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని ఆయన కోరారు. జగన్‌రెడ్డి పాలనా వైఫల్యంతో దళితులు, గిరిజనులు, బీసీలు, రైతులే కాదు.. రాష్ట్రంలోని అన్ని రంగాల్లోని అన్ని వర్గాల ప్రజలు ఎంతో ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. కరెంట్ గురించి ఆలోచిస్తేనే ఓ వైపు కోతలు.. మరోవైపు వాతలు పడుతున్నాయన్నారు. టిడిపి ప్రభుత్వ హయాంలో సీజేఎఫ్ఎస్‌ను రద్దు చేసి డికెటి పట్టాలు మంజూరు చేయడం ద్వారా వేలాది మంది దళితులకు భూములపై యాజమాన్య హక్కులు కల్పించామన్నారు. ఇప్పుడు జగన్‌రెడ్డి పాలనలో చేసిందేమైనా ఉందంటే.. అది దళితులను వేధించడం, హింసించడమేనన్నారు. దళితులపై అక్రమ కేసులను బనాయించడం, చివరకు ప్రాణాలు తీసేందుకు కూడా వెనకాడకపోవడం దారుణమన్నారు. ఈ అరాచకాలకు స్వస్తి పలకాలంటే తెలుగుదేశం అధికారంలోకి రావాలని, ఈ విషయంలో ప్రజలందరినీ చైతన్యవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన పార్టీవర్గాలకు సూచించారు.

● 35 ఏళ్ళ తర్వాత ఆత్మీయ సమ్మేళనం

# నాటి తియ్యటి జ్ఞాపకాల్లో.. పూర్వ విద్యార్థులు



బడి చదువుల నాటి తియ్యటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ పూర్వ విద్యార్థులందరూ పులకించిపోయారు. చిన్ననాటి స్నేహాలను గుర్తుకు తెచ్చుకుని మురిసిపోయారు. చదువు పూర్తయ్యాక ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా దాదాపు 35 ఏళ్ళ సుదీర్ఘకాలం తర్వాత అందరూ కలుసుకుని ఒకరికొకరు ఆత్మీయంగా మాట్లాడుకున్నారు. ఈ సంతోషానికి వేదికైంది అనంతసాగరం మండలంలోని సోమశిల జిల్లాపరిషత్తు హైస్కూల్. 1986–87 సంవత్సరంలో ఇక్కడ పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు ఇటీవల ఆ స్కూల్‌లో కలుసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పి సమాజంలో ఉత్తమపౌరులుగా తీర్చిదిద్దిన గురువులను గౌరవంగా ఆహ్వానించి కొత్తదుస్తులు బహూకరించి సన్మానించుకున్నారు. పాఠశాలకు ఫర్నిచర్ కొరత ఉండడాన్ని గమనించి విద్యార్థులంతా కలసి కొత్త ఫర్నిచర్‌ను కొనుగోలు చేసి తాము చదువుకున్న బడికి కొత్తదనం తీసుకువచ్చారు. తమతో పాటు చదువుకున్న వారిలో ఇద్దరు స్నేహితుల ఆర్థికపరిస్థితులు బాగా లేవని తెలుసుకుని వారికి ఆర్థికసాయం కూడా అందించి చిన్ననాటి స్నేహాలకు సార్థకత చేకూర్చారు. వారందరికీ పాఠాలు చెప్పిన అయ్యవార్లు తమ విద్యార్థుల ఔన్నత్యానికి సంతోషించారు.

# ఎన్‌బికెఆర్‌లో యాక్సిన్-2022 సదస్సు




కోట మండలం విద్యానగర్‌లో ఉన్న ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో ఇటీవల యాక్సిన్–2022 జాతీయస్థాయి సాంకేతిక సదస్సు జరిగింది. ఇసిఇ విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సును కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఇలాంటి సదస్సులు ఎంతో ఉపయోగపడతాయని, సాంకేతిక పత్రాల ప్రదర్శన, హార్డ్‌వేర్ రూపకల్పన వంటి విషయాలను కూడా విద్యార్థులు పరిపూర్ణంగా గ్రహించాల్సి ఉందన్నారు. కళాశాల యాజమాన్యం ఇలాంటి కార్యక్రమాలకు ఎంతో ప్రోత్సాహం ఇస్తోందన్నారు. విద్యార్థుల్లోని నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఇలాంటి సదస్సులు దోహదం చేస్తాయని ఇసిఇ విభాగాధిపతి డాక్టర్ హరినాథ్‌రెడ్డి సూచించారు. సదస్సు సమన్వయకర్త జి.నాగార్జునరెడ్డితో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## డిఎస్పీ ఆఫీసులో తిరుపతి ఎస్పీ

# పరమేశ్వరరెడ్డి



మాట్లాడుతున్న తిరుపతి ఎస్పీ పరమేశ్వరరెడ్డి, పక్కన గూడూరు డిఎస్పీ రాజగోపాలరెడ్డి

నూతన జిల్లాలు ఏర్పడిన తర్వాత గూడూరు డిఎస్పీ ఆఫీసును తిరుపతి ఎస్పీ పరమేశ్వరరెడ్డి తొలిసారిగా ఈ నెల 13వ తేదీ సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ల వారీగా గూడూరు డివిజన్‌లో పని చేస్తున్న సిఐలను, ఎస్‌ఐలను పరిచయం చేసుకున్నారు. అనంతరం స్టేషన్ల వారీగా పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. శాంతిభద్రతల విషయంలో రాజీపడకుండా విధులను నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గూడూరు డిఎస్పీ రాజగోపాలరెడ్డి, సిఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

## డ్వామా పీడీగా

# డీఎంకే తులసి



తిరుపతి జిల్లా డ్వామా పీడీగా డిఎంకె తులసిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తులసి చిత్తూరుజిల్లా డిఆర్‌డిఏ పీడీగా పని చేస్తున్నారు. ఏడాదిపాటు డిప్యుటేషన్ పద్ధతిలో ఆమెను తిరుపతి జిల్లాకు డ్వామా పీడీగా నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

## కాకాణికి.. ఆనం అభినందన



నెల్లూరు జిల్లా నుంచి మంత్రి పదవికి ఎంపికైన సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డిని వెంకటగిరి ఎమ్మెల్యే, మాజీమంత్రి ఆనం రామనారాయణరెడ్డి అభినందించారు. ఈనెల 10న ఆయన కాకాణి నివాసానికి వెళ్ళి శుభాకాంక్షలు తెలియజేశారు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# యాదవుల అభివృద్ధికి కృషి చేయాలి



గోపాల్‌యాదవ్‌ను సన్మానిస్తున్న దేవసేనమ్మ

తెలుగు యాదవ మహాసభ కార్యనిర్వాహక రాష్ట్ర కార్యదర్శిగా ఎంపికైన పడాల గోపాల్‌యాదవ్‌ని స్వచ్ఛాంధ్ర రాష్ట్ర ఛైర్‌పర్సన్ పొణకా దేవసేనమ్మ మంగళవారం ఆమె నివాసంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కష్టపడి పనిచేసే వ్యక్తులను గుర్తించి పదవులు ఇవ్వడం ద్వారా ఎంతోమంది అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. యాదవుల అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి గోపాల్‌యాదవ్ విశేష సేవలు చేస్తుండడం అభినందనీయమన్నారు. వాసు, ప్రతీష్‌యాదవ్, పవన్‌కుమార్, శ్రీనివాసులు, కృష్ణమూర్తి, లక్ష్మీ, ప్రమీల, లఖిత తదితరులు పాల్గొన్నారు.

## ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో

# ప్రజావైద్యుడు సిఆర్‌రెడ్డికి సత్కారం




వైద్య రంగంలో విశేష సేవలందించిన గూడూరుకు చెందిన సీనియర్ సర్జన్ డాక్టర్ సిఆర్‌రెడ్డికి ఘన సత్కారం జరిగింది. నారాయణ మెడికల్ కళాశాలలో జరిగిన ప్రొఫెషనల్స్ మీట్‌లో డాక్టర్ సిఆర్‌రెడ్డిని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రతినిధులు, పలువురు వైద్యులు ఘనంగా సత్కరించారు. నెల్లూరు చింతారెడ్డిపాలెంలో ఉన్న నారాయణ మెడికల్ కళాశాలలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల స్పెషలిస్ట్, సూపర్ స్పెషలిస్ట్ వైద్యుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముందుగా పరిచయ కార్యక్రమం నిర్వహించారు. అనేక మంది వైద్యులు ఇప్పటివరకు అందించిన సేవలు, వైద్య రంగంలో సాధించిన విజయాలను సమావేశంలో వివరించారు. తక్కువ ఖర్చుతో వైద్య సేవలు అందిస్తూ ప్రజా వైద్యుడుగా పేరుపొందిన గూడూరు డాక్టర్ సిఆర్ రెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ సిఆర్‌రెడ్డి యువ వైద్యులకు పలు సూచనలు చేశారు. డబ్బు కోసం వెంపర్లాడకుండా సేవ చేయాలని సూచించారు. ప్రముఖ వైద్యులు చెరుకూరు జనార్ధన్‌రెడ్డి, గంగాధర్‌రెడ్డి, చంద్రహాస్, ప్రకాష్, నారాయణ మెడికల్ కళాశాల సీఈవో భాస్కర్‌రెడ్డి, సూపరింటెండెంట్ హరిప్రసాద్‌రెడ్డి, పలువురు స్పెషలిస్టులు, సూపర్ స్పెషలిస్టులు పాల్గొన్నారు.

# నేత్రపర్వంగా శ్రీరామనవమి

- కన్నులపండువగా సీతారాముల కల్యాణాలు
- రామనామంతో మార్మోగిన రామాలయాలు



శ్రీరామనవమి సందర్భంగా ఈనెల 10వ తేదిన జిల్లాలోని రామాలయాల్లో నేత్రపర్వంగా వేడుకలు జరిగాయి. ఆలయాలు విద్యుద్దీపాలంకరణలతో శోభాయమానమయ్యాయి. రామనామంతో ఆలయాలు మార్మోగాయి. పలు వైష్ణవాలయాల్లోనూ, సాయిబాబా మందిరాల్లోనూ శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి. భక్తులకు పానకం, వడపప్పు ప్రసాదంగా అందించారు. నగరంలోని రంగనాయకులపేటలో కొలువై ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ రంగనాథస్వామి దేవస్థానంలో శ్రీరామనవమి, పంగున్యుత్తర ఉత్సవాలను వేడుకగా నిర్వహించారు. బాలాజీనగర్‌లో ఉన్న శ్రీ సీతారామ మందిరం, పప్పులవీధిలోని శ్రీ మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం, పరమేశ్వరినగర్‌లోని శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయం, వనంతోపు సెంటర్‌లోని శ్రీరామాలయం, గాంధీ గిరిజన కాలనీలోని సీతారాముల దేవాలయం.. ఇలా అనేక దేవాలయాల్లో శ్రీరామనవమి వేడుకలు కన్నుల పండువగా జరిగాయి.

### శబరి శ్రీరామక్షేత్రంలో :

నెల్లూరు నగరంలో ప్రసిద్ధిచెందిన శబరి శ్రీరామక్షేత్రంలో సీతారాముల కళ్యాణోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. భక్తులు వేలాదిగా తరలివచ్చి కళ్యాణోత్సవాన్ని తిలకించి తరించారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రాల మధ్య కళ్యాణోత్సవాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. టిటిడి వేద పండితులు గంజాం రామకృష్ణసాయి వ్యాఖ్యాతగా వ్యవహరించి శ్రీ సీతారాముల కళ్యాణోత్సవ ఘట్టాన్ని అద్భుతంగా వివరించారు. వైకాపా రాష్ట్ర కార్యదర్శి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాసయాదవ్ స్వామివారికి, అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. దాతలు పిడూరు కిశోర్‌రెడ్డి, శరణ్య, పిడూరు భానుప్రకాష్‌రెడ్డి, నాగమణి దంపతులు స్వామివార్లకు ముత్యాల తలంబ్రాలు తీసుకొచ్చారు. నెల్లూరు నగర మేయర్ పొట్లూరి స్రవంతి, మాజీ మేయర్ అబ్దుల్ అజీజ్, శ్రీశైల దేవస్థానం ధర్మకర్తల మండలి మాజీ సభ్యులు.. ప్రముఖ దాత ఆల్తూరు గిరీష్‌కుమార్‌రెడ్డి, దేవాదాయశాఖ అధికారి పోరెడ్డి శ్రీనివాసులు రెడ్డి తదితర ప్రముఖులు పాల్గొన్నారు. భక్తులు రాసిన రామకోటి పుస్తకాలను చెంతనే ఉన్న శ్రీరామకోటి స్థూపంలో నిక్షిప్తం చేశారు. ఆలయ నిర్వాహకులు చెన్నూరు వెంకటేశ్వరరెడ్డి, చంద్రారెడ్డి, సుబ్బరాజు, భక్తబృందం వారు ఈ వేడుకలను పర్యవేక్షించారు. స్వామివార్లకు సమర్పించిన ముత్యాల తలంబ్రాలను, తోరణాలను, అక్షతలను, తిరుమల నుంచి తెప్పించిన శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని భక్తులకు అందజేశారు. అనంతరం వేలాదిమంది భక్తులకు పక్కనే ఉన్న టిటిడి కళ్యాణమండపంలో అన్నప్రసాద వితరణ చేశారు.

## కాకాణికి మంత్రి పదవి దక్కడంతో

# పేర్నాటి యువసేన సంబరాలు



ఆంధ్రప్రదేశ్ కొత్త మంత్రి వర్గంలో నెల్లూరు జిల్లా నుండి కాకాణి గోవర్ధన్ రెడ్డికి అవకాశం రావడంతో పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి ఆదేశాల మేరకు పేర్నాటి యువసేన, వైకాపా అభిమానులు సంబరాలు జరిపి పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పాత బస్‌స్టాండ్ సెంటర్, సంగం సినిమాహాల్ సెంటర్, బనికిసాహెబ్‌పేట సెంటర్‌లలో పేర్నాటి యువసేన నాయకుడు మూలి కిషోర్‌రెడ్డి ఆధ్వర్యంలో బాణాసంచా వేడుకలు నిర్వహించి, స్వీట్లు పంచుకున్నారు. వైసీపీ పట్టణ ఎస్‌టి సెల్ అధ్యక్షుడు పుట్టయ్య, శ్రీధర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, సాయి తదితరులు పాల్గొన్నారు.

బాలాజీనగర్ సీతారామస్వామి మందిరంలో..

# శాస్త్రోక్తంగా పుత్రకామేష్టి యాగం



నెల్లూరు బాలాజీనగర్‌లోని శ్రీ సీతా రామ స్వామి మందిరంలో ఈ నెల 9న ఎంతో ప్రసిద్ధమైన పుత్రకామేష్టి యాగం జరిగింది. అర్చకులు బ్రహ్మశ్రీ మాచవోలు కోటేశ్వరశర్మ, నారాయణ దాశరథి భట్టాచార్యుల ఆధ్వర్యంలో వేదపండితులు ఈ యాగాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. సుడా ఛైర్మెన్ ముక్కాల ద్వారకానాథ్, తమిళనాడు సిబిఐ కోర్టు జడ్జి తిరువెంకట శ్రీనివాసన్, మందిర కమిటీ అధ్యక్ష కార్యదర్శులు అమర్తలూరు వెంకటేశ్వర్లు గుప్తా, సోమిశెట్టి వెంకటరత్నం, కోశాధికారి తన్నీరు మస్తాన్‌రావు, వాకాటి నరసయ్య, అమరా మోహన్‌రావు, కిషోర్, ఆంజనేయులు,ఉభయకర్తలు,పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# అందరినీ ఆకట్టుకున్న.. శ్రీమద్రామాయణ సప్తాహం



వద్య సార స్వత పరిషత్ నెల్లూరు శాఖ వారు నెల్లూరు బాలాజీనగర్‌లోని శ్రీ సీతారామస్వామి మందిరంలోమార్చి 24వ తేది నుంచి 30వ తేది వరకు ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించిన శ్రీమద్రామాయణ సప్తాహం అందరినీ బాగా ఆకట్టుకుంది. తొలిరోజున ఇనమడుగు శ్రీ సత్యానంద ఆశ్రమ పీఠాధిపతి శ్రీహరి తీర్థస్వామి సభను ప్రారంభించగా అవధాని కోట రాజశేఖర్ బాలకాండంపై ప్రసంగించారు. 25న ఆ సంస్థ అధ్యక్షులు పోలవరపు లక్ష్మీ నరసింహారావు 'అయోధ్యాకాండ', 26న విడవలూరు డిగ్రీ కాలేజీ జువాలజీ లెక్చరర్ శ్రీనివాస చక్రపాణి 'అరణ్యకాండ', 27న విద్వాన్ అగస్త్యరాజు సుబ్బారావు 'కిష్కింధ కాండ', 28న డాక్టర్ చీమకుర్తి వేంకటేశ్వరరావు 'సుందరకాండ', 29వతేదీన శతావధాని డాక్టర్ సూరం శ్రీనివాసులు 'యుద్ధ కాండ'లలోని ఘట్టాలను అత్యద్భుతంగా విశదీకరించారు. 30న ఉగాది కవి సమ్మేళనం జరిగింది. పదిహేను మంది పద్యకవులు పాల్గొన్నారు. అనంతరం డాక్టర్ చీమకుర్తి 'ఉత్తర కాండ'లోని ఘట్టాలను వివరించారు. అనంతరం ఉపన్యాసకులను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. పద్యకళాపరిషత్ అధ్యక్షులు మెట్టు రామచంద్రప్రసాద్, నలుబోలు బలరామయ్యనాయుడు, మందిరం కమిటీ అధ్యక్షుడు అమర్తలూరు వేంకటేశ్వర గుప్తా, బొమ్మిశెట్టి యలమందయ్య ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కురిచేటి రామారావు-భారతీదేవి, ఎం. వేంకటరెడ్డి, చక్కిరాల జయప్రసాదరావు, గోవిందాచారి రమాదేవి, కె.ఎస్ దండపాణి, సుబ్బు శ్రీనివాస్ మాధవి, అన్నవరం సత్యనారాయణలు సభాపోషకులుగా సహకరించారు. మురారిశెట్టి తిరుపతిస్వామి ప్రసాద వితరణ చేశారు.

# అటు మామిడి.. ఇటు బత్తాయి!

## కొత్త జిల్లాలో ఉద్యానపంటలు కళకళ







జిల్లాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా నెల్లూరు జిల్లాలో ఉద్యానపంటలకు నిలయంగా ఉన్న కందుకూరు నియోజకవర్గం కూడా కలవడంతో ఉద్యానపంటల విస్తీర్ణం జిల్లాలో దాదాపు 44,400 హెక్టార్లకు పెరిగిందని సంబంధిత అధికారులు అంచనా వేశారు. జిల్లా ఉద్యాన అధికారిగా కొత్తగా నియమితులైన ఎల్.శ్రీనివాసరావు ఇటీవల ఉద్యాన అధికారులతో కందుకూరులో సమావేశమై ఉద్యాన పంటల ప్రగతిని సమీక్షించారు. కందుకూరు నియోజకవర్గంలోని ఉలవపాడు, గుడ్లూరు మండలాలు ఎంతో కాలంగా మామిడిసాగుకు పెట్టిందిపేరు. ఉలవపాడు మామిడిపండ్లంటే ఎంతో ప్రసిద్ధి కూడా. ఇక్కడి నుంచి బెంగుళూరు, ముంబై, చెన్నై తదితర దూరప్రాంతాలకు ఉలవపాడు మామిడిపండ్లు ఎగుమతి అవుతుంటాయి. అదేవిధంగా ఉలవపాడులో సపోటా కూడా బాగా సాగవుతోంది. ఇతర రాష్ట్రాలకు సపోటాలు ఇక్కడి నుంచి ఎగుమతి చేస్తుంటారు. ఇటువైపు ఉదయగిరి చుట్టుపక్కల ప్రాంతాల్లో బత్తాయి సాగు కూడా అధికంగా ఉంది. ధరలు కూడా ఆశాజనకంగానే ఉన్నాయి. అదేవిధంగా కందుకూరు మండలంలోని మాచవరం గ్రామం తమలపాకు తోటలకు ప్రసిద్ధి. దాదాపు 250 ఎకరాలకు పైగానే ఉన్న తమలపాకు తోటలు నెల్లూరుజిల్లా పరిధిలోకే వస్తున్నాయి. అటు మామిడి, ఇటు బత్తాయి, తమలపాకు తోటల సాగుతో ఇక.. నెల్లూరుజిల్లా వరిపంటతో పాటు.. ఉద్యాన పంటలకు కూడా నిలయంగా మారి మరింత కళకళలాడనుంది.

# జిల్లాకు 'నృసింహ' కటాక్షం







పునర్వ్యవస్థీకరణ నేపథ్యంలో రాపూరు మండలంలోని పెంచలకోనలో ఉన్న ప్రసిద్ధ పుణ్యక్షేత్రం జిల్లాకు దక్కుతుందో లేదోనని భక్తులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో, అటు కందుకూరు నియోజకవర్గంలోని ఓలేటివారిపాళెం మండలంలో ఉన్న సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం.. మాలకొండ లక్ష్మీనారసింహ క్షేత్రం కూడా జిల్లాలో కలవడంతో నరసింహస్వామి భక్తుల్లో ఆనందం తాండవిస్తోంది. ప్రజల అభ్యర్థనలు, వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డిల చొరవతో రాపూరు మండలం నెల్లూరుజిల్లాలోనే ఉండడంతో పెంచలకోన క్షేత్రం నెల్లూరుజిల్లా పరిధిలోనే ఉండిపోతుంది. కందుకూరు కలిశాక మాలకొండ లక్ష్మీనారసింహుని కటాక్షం కూడా జిల్లావాసులకు కలిగినట్లయింది. గతంలో కందుకూరు నియోజకవర్గం కూడా నెల్లూరుజిల్లాలోనే ఉండేది. కొత్తగా ప్రకాశంజిల్లా ఏర్పాటుతో 1970 ఫిబ్రవరి 2వ తేదిన కందుకూరు ప్రకాశం జిల్లాలో కలసిపోయింది. ఇప్పుడు మళ్ళీ పునర్వ్యవస్థీకరణతో కందుకూరు నెల్లూరుజిల్లాలో కలవడం పట్ల సంతోషం వ్యక్తమవుతోంది.

# అవధాని కోట రాజశేఖర్‌కు సన్మానం



కోవూరులోని శ్రీ కోదండరామస్వామి దేవస్థానంలో ఈనెల 11న ప్రముఖ అవధాని కోట రాజశేఖర్‌కు ఘన సన్మానం జరిగింది. టిటిడి హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఏడురోజుల పాటు ఆయన 'శ్రీమద్రామాయణ ప్రవచన సప్తాహం' నిర్వహించిన సందర్భంగా మాజీ సిడిసి ఛైర్మెన్ కృష్ణారెడ్డి, పారిశ్రామికవేత్త కాటంరెడ్డి కృష్ణారెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంతాచార్యులు, రిటైర్డ్ సిపిఓ వనం సుబ్రహ్మణ్యం ఘనంగా సత్కరించారు.

# పరమేశ్వరుని గురు స్వరూపమే.. 'తిమ్మాయపాళెం'.. గురప్పస్వామి





మన దేవాలయాలు 95

*'గురు బ్రహ్మ, గురుర్విష్ణు:..గురు దేవో మహేశ్వర:*
*గురు స్సాక్షాత్ పరబ్రహ్మ!..తస్మై శ్రీ గురవే నమ:'...*

అంటున్నాయి మన ప్రాచీన శాస్త్రాలు!.. నిత్యమై సత్యమై వెలుగొందే ఆ పరబ్రహ్మ స్వరూపమే గురువు అన్నది లోక విదితం. గురువంటే ఎవరంటే?..అజ్ఞానమనే చీకట్లను తొలగించి, మనలో జ్ఞానమనే వెలుగులను ప్రసాదించేవారే గురువులు. అందులోనూ దైవజ్ఞానాన్ని బోధించి ఆ పరమాత్మ సాక్షాత్కారానికి చేరువచేసే సాక్షాత్ దైవస్వరూపులు గురువులే. అందుకే ఆ పరమాత్మ కూడా అనేక రూపాలు, నామాలతో పాటు గురు రూపంలో కూడా వెలసి మానవాళిని కరుణిస్తున్నాడు. అనేక క్షేత్రాల్లో గురుస్వరూపంలోనూ కొలువై ఉన్నాడు. అలాంటి పుణ్యక్షేత్రం ఒకటి నెల్లూరుజిల్లాలోనూ ఉండడం విశేషం. దక్కిలి మండలం పలుగోడు పంచాయతీలోని తిమ్మాయపాళెం గ్రామంలో వెలసిన ఆ సదాశివుడే గురుస్వామిగా.. గురప్పస్వామిగా పేరొంది పూజలందుకుంటున్నాడు. గురప్పస్వామి దేవాలయంగా ప్రసిద్ధి చెందిన ఈ క్షేత్రానికి వందల ఏళ్ళనాటి ఘనమైన చరిత్రే ఉంది.

## దాదాపు 500 ఏళ్ళ నాటి ఆలయం

ఈ ఆలయం ఎంతోకాలం నుంచి ఉందని, సుమారు అయిదు వందల సంవత్సరాల క్రితం నుంచే ఈ ఆలయం భక్తుల పూజలందుకుంటూ ఉందని, తరతరాలుగా తాము కూడా గురప్పస్వామిని కులదైవంగా కొలుచుకుంటున్నామని గ్రామస్తులు చెప్తున్నారు. వెంకటగిరి-రాపూరు మార్గంలో 10 కిలోమీటర్ల దూరంలోని తిమ్మాయపాళెం గ్రామంలో పచ్చటి పొలాల మధ్య ఆ ఆలయం ఉంది. పూర్వకాలంలో శివభక్తుడైన ఓ రైతు తన పొలంలో వరిపంటను కోసి కల్లాంలో వేసివుండగా ఉన్నట్లుండి వర్షం కురవడం ప్రారంభించింది. 'ఇన్నాళ్ళు చేసిన కష్టమంతా వర్షార్పణమేనా?..ఈ కష్టం నుంచి గట్టెక్కించు స్వామీ'.. అని ఆ రైతు తమ ఆరాధ్యదైవమైన గురప్పస్వామిని కన్నీటితో ప్రార్థించగా, ఆ రైతు పొలంలో మినహా చుట్టూతా మిగతాచోట్లంతా భారీవర్షం కురవడం జరిగిందట. ఆ వింతను గ్రామస్తులందరూ కళ్ళారా చూసి విస్తుపోయారట. ఆ మహిమంతా ఆ స్వామిదేనని భావించిన 'మచ్చా' అనే ఇంటిపేరున్న ఆ రైతు తాను కల్లాం వేసిన స్థలంలోనే వేపచెట్టు కింద ఉన్న పుట్ట వద్ద ఆ పరమశివుని ప్రతిరూపమైన 'గురప్పస్వామి'ని ప్రతిష్ఠించి పూజలు చేయడం ప్రారంభించారట. నాటినుంచి నేటికీ పరమేశ్వరుని రూపంలో 'గురప్పస్వామి' అందరి పూజలందుకుంటూనే ఉన్నాడు. ఇప్పటికీ ఆ వంశస్థుడైన మచ్చా భాస్కరయ్య ఆధ్వర్యంలోనే స్వామివారికి పూజలు అభిషేకాలు వైభవంగా జరుగుతున్నాయి. గురప్పస్వామి అంటే సాక్షాత్తూ శివుడేనని, దక్షిణామూర్తి అంశ అని గ్రామస్తులంతా భావిస్తున్నారు. ఈ ప్రాంతంలోనే పూర్వకాలంలో 'గురప్పస్వామి' అనే ఒక అవధూత కూడా ఉండేవారని, ఆయనెంతో మహిమగలవారని ప్రసిద్ధి.

## కోరిన కోర్కెలు తీర్చే దైవం :

గురప్పస్వామిని నమ్మి కొలుచుకుంటే ఎలాంటి బాధలు ఉండవని, ఎలాంటి ఆపదలైనా స్వామివారి కరుణతో తీరిపోతాయని, కోరిన కోర్కెలు నెరవేరి ప్రశాంతమైన జీవితం లభిస్తుందనేది భక్తజనులందరికీ తెలిసిన విషయమే. ముఖ్యంగా వివాహాలు కానివారికి వివాహాలు జరుగుతాయి. పిల్లలు లేనివారికి సంతానప్రాప్తి తప్పకుండా కలుగుతుంది. అంతేకాదు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు స్వామివారికి మొక్కుకుంటే ఎంతటి వ్యాధుల బాధలైనా సమసిపోతాయని ప్రతీతి. అందుకే భక్తులకు కొంగుబంగారంగా నిలిచిన ఈ ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య క్రమేణా పెరుగుతూ ఉంది.

## ప్రతి ఏటా వైభవంగా తిరునాళ్ళ

గురప్పస్వామి తిరునాళ్ళంటే తిమ్మాయపాళెం ఆ చుట్టుపక్కల గ్రామాల్లో పెద్ద పేరు. ఎందరో భక్తులు తమ ఇలవేల్పు అయిన గురప్పస్వామి పేరునే 'గురవయ్య', 'గురప్ప', 'గురునాథం' తదితర పేర్లుగా పెట్టుకోవడం ఆనవాయితీగా మారింది. ఈ ఆలయాన్ని ఆలయ నిర్వాహకులు, గ్రామస్తులు, దాతలు.. భక్తులందరి సహకారంతో ఇటీవలికాలంలో మరింతగా అభివృద్ధి చేశారు. గర్భాలయంలో కొలువై ఉన్న శ్రీస్వామివారికి నిత్య పూజలు, సేవలు, అభిషేకాలు జరుగుతుంటాయి. ఏటా తిరునాళ్ళ ఎంతో వైభవంగా జరుగుతుంటుంది. వైశాఖమాసంలో పౌర్ణమి తర్వాత వచ్చే తదియ రోజున స్వామివారికి మేళతాళాలతో, భజనలు, కోలాటాల కోలాహలంతో ఎంతో సంబరంగా తిరునాళ్ళ నిర్వహిస్తుంటారు. ఈ ఏడాది గురప్పస్వామి తిరునాళ్ళ వచ్చే మే నెల 18వ తేదిన వస్తుంది. ఆరోజున తిమ్మాయపాళెం భక్తజనసముద్రంగా మారుతుంది. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తరిస్తుంటారు. పెద్దఎత్తున అన్నప్రసాద వితరణ జరుగుతుంటుంది. అన్ని రూపాలు తానే అయిన ఆ మహాదేవుని గురుస్వరూపాన్ని ఆ ఆలయంలో 'గురప్పస్వామి'గా దర్శించుకోగలగడం భక్తులకు పూర్వజన్మ సుకృతమే!..

# ప్రమోషన్.. ఎమోషన్!

(మొదటి పేజీ తరువాయి)

దీంతో, మంత్రివర్గంలో కొనసాగించడానికి గానీ, తొలగించడానికి గానీ జగన్ & టీం అనుసరించిన కొలబద్ద ఏమిటన్నది అర్థం గాక, వైసీపీ వర్గాలు తలలు పట్టుకున్నాయి. కేవలం ఒక్కరి సలహామేరకు జరిగిన మార్పులలో సమన్యాయం జరగలేదన్న వ్యాఖ్యానాలు గట్టిగా వినిపించాయి. ఇంకా వినిపిస్తున్నాయి కూడా..!

## పాతోళ్ళు 11 - కొత్తోళ్ళు 14!

జనం అంచనాలను, రాజకీయ విశ్లేషకుల ఊహాగానాలను, మీడియా కథనాలను, పార్టీ శ్రేణుల ఆశలను తారుమారు చేస్తూ కొత్త మంత్రివర్గాన్ని ఏర్పాటు చేసుకున్నారు జగన్. తీవ్రమైన ఒత్తిళ్ళు, కుల సమీకరణలు, భవిష్యత్తులో రానున్న ఎన్నికలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని, మొత్తం పాతికమందిలో పదకొండు మంది పాతవాళ్లను కొనసాగిస్తూ, పద్నాలుగు మందిని ఇంటికి పంపించారు. వాళ్ళ స్థానాలలో పద్నాలుగు మంది కొత్త వాళ్ళను నియమించుకున్నారు. 10వతేదీ సాయంత్రం పార్టీ అధికారికంగా ప్రకటించేవరకూ ఈ మార్పులపై సస్పెన్సు కొనసాగింది. ప్రమాణస్వీకారానికి ముందు రోజు రాత్రి లిస్టు బయటపెట్టారు.

## అంతా తానే అయ్యి నడిపించిన సజ్జల

పార్టీ పెట్టకముందునుండీ అన్ని విషయాలలో జగన్‌కు అండదండలు అందించిన ఆయన బాబాయ్ వై.వి.సుబ్బారెడ్డి, ఆర్థిక వ్యవహారాలతో పాటు, జగన్ వ్యక్తిగత ప్రతిష్ట కోసం తొలినుండీ పాటుపడిన వేణంబాక విజయసాయిరెడ్డి, ఢిల్లీ స్థాయిలో పార్టీ వ్యవహారాలు చూడడంతో పాటు, రాష్ట్రంలో అనేక సందర్భాలలో ట్రబుల్ షూటర్‌గా పాటుపడుతున్న వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి వంటి వారు మంత్రివర్గ మార్పు కూర్పుల వ్యవహారంలో ఎక్కడా కనిపించకపోవడం తమకు ఆశ్చర్యం కలిగించిందంటున్నాయి పార్టీ వర్గాలు. పార్టీ అధికారం చేపట్టిన నాటి నుండి ముఖ్య సలహాదారుగా వ్యవహరిస్తున్న జగన్ సతీమణి సమీప బంధువు సజ్జల రామకృష్ణారెడ్డి ఈసారి మంత్రి మండలి మార్పు విషయంలో కీలకపాత్ర పోషించారు. భవిష్యత్తులో రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని చేయవలసిన మార్పు ఇది. ఇలాంటి మార్పు సమయంలో జగన్ కేవలం సజ్జల ఒక్కరితోనే సుదీర్ఘ చర్చలు జరపడం చాలామందికి మింగుడు పడడం లేదు. సజ్జల వల్లనే తమకు మంత్రివర్గంలో స్థానం దక్కలేదని కూడా కొంతమంది నాయకులు వాపోతున్నారు.

## ఇంటినుండే రేగిన అసంతృప్తి జ్వాల!

సీనియర్లని కొంతమందిని కొనసాగించే క్రమంలో జగన్ కుటుంబ సభ్యుడు, వైవీ సుబ్బారెడ్డికి స్వయానా చెల్లెలి భర్త బాలినేని శ్రీనివాసులరెడ్డిని పక్కన పెట్టడం కూడా కీలక అంశంగా మారింది. కొత్త కూర్పుపై తొలి వ్యతిరేక స్వరం తమ కుటుంబసభ్యుడి నుండే వినిపించింది. అసమ్మతి జ్వాల కూడా అక్కడినుండే రాజుకుంది. జగన్ నిర్ణయాన్ని వ్యతిరేకించే ధైర్యం ఎవరికీ ఉండదని పార్టీ వర్గాలు ఇంతకాలం భావిస్తూ వచ్చాయి. ఈ తరుణంలో బాలినేని నిరసన వాణి వినిపించడం చాలామందిలో ధైర్యాన్ని నింపింది. ఆయనే మాట్లాడగా లేనిది.. మనదేముందంటూ ఒక్కొక్కరుగా నోరు విప్పసాగారు. బాలినేని నుండి ఈ విధమైన ప్రతిస్పందన ఊహించని జగన్ వెంటనే సజ్జలను రంగంలోకి దించినా ప్రయోజనం కనపడలేదు. చివరికి ఆయనే స్వయంగా పిలిపించుకుని బుజ్జగించాల్సి వచ్చింది. మిగతా అసంతృప్తి వాదులను కూడా సముదాయించడం సజ్జలకి సాధ్యం కాకపోవడంతో ముఖ్యమంత్రే రంగంలోకి దిగవలసి వచ్చిందని పార్టీవర్గాల సమాచారం. తనకు వ్యతిరేకంగా ధిక్కార స్వరాన్ని అస్సలు ఊహించని జగన్ ఈ పరిణామాలతో కొంత ఆశ్చర్యానికి, అసహనానికి కూడా లోనైనట్టు వారు చెప్తున్నారు.

## మార్పుతో లాభమా..? నష్టమా...??

దాదాపుగా మూడేళ్ల తరువాత ముఖ్యమంత్రి తీసుకున్న మంత్రివర్గ మార్పు నిర్ణయం వల్ల పార్టీకి లాభమా..? నష్టమా..?? అన్న అంశాన్ని బేరీజు వేయడంలో ఇప్పుడు పార్టీ నాయకత్వంతో పాటు, శ్రేణులు కూడా తలమునకలై ఉన్నాయని రాజకీయవర్గాల వారు అంటున్నారు. ఇలా చేసే బదులు పాతవారినే కొనసాగించి ఉంటే ఈ అలకలు, అసంతృప్తులు, ఉండేవి కాదేమో అన్న అంతర్మథనం కూడా లేకపోలేదని పార్టీ వర్గాలు భావిస్తున్నాయని కొంతమంది సీనియర్ నాయకులు అంటున్నారు. కానీ కంగారు పడవలసిందేమీ లేదని, ఇదంతా తాత్కాలికమేనని, కొద్దిరోజులకి అన్నీ సర్దుకుంటాయని జగన్ భక్తులు అంటున్నారు. ఎన్నికలకు మరో రెండేళ్ళు గడువున్న తరుణంలో, పాలన కోసం ఏర్పడిన జగన్ కొత్తటీం ముందు ముందు చాలా సవాళ్ళు ఎదుర్కోక తప్పదన్న మాట ఏకాభిప్రాయంగా వినపడుతోంది. ఒకవేళ ముందస్తు ఎన్నికలు వస్తే కొత్తమంత్రులు సర్దుకోవడానికే సమయం సరిపోదని కూడా అంటున్నారు.

మొత్తంమీద వైసీపీ ఎంఎల్ఏలకు, నాయకులకు, కార్యకర్తలకు ఓ విషయం స్పష్టం అయింది. తాను తీసుకున్న నిర్ణయం నుంచి వైసీపీ అధినేత జగన్, ఒక్క అంగుళం కూడా పక్కకు జరగరనే విషయం కొత్త మంత్రివర్గ కూర్పు స్పష్టం చేసింది. అయితే, ఈ నిర్ణయం పార్టీకి లాభమా.. కాదా... అనేది ఇప్పుడు చెప్పలేమని పరిశీలకులు అంటున్నారు.

# డిసిసి ఆధ్వర్యంలో.. డా.అంబేద్కర్‌కు నివాళి




అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న చేవూరు దేవకుమార్‌రెడ్డి

భారత రాజ్యాంగ నిర్మాత డా.బిఆర్ అంబేద్కర్ 131వ జయంతి సందర్భంగా ఈనెల 14న జిల్లా కాంగ్రెస్ కమిటీ (డిసిసి) అధ్యక్షులు చేవూరు దేవకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఆ మహనీయుని సేవలను స్మరించుకున్నారు. సామాజిక సంస్కర్తగా, రాజ్యాంగ నిర్మాతగా డా. అంబేద్కర్ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. డిసిసి ఉపాధ్యక్షుడు బాలసుధాకర్, నగర అధ్యక్షుడు ఫయాజ్, యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడు గణేష్, సేవాదళ్ అధ్యక్షుడు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# 15 నుంచి.. సముద్రంలో చేపలవేట నిషేధం

ఈనెల 15 నుంచి జూన్ 14 వ తేది వరకు సముద్రంలో వేటను నిషేధిస్తున్నామని, ఈ కాలంలో సంతానోత్పత్తితో మత్స్యసంపద పెంపొందుతుందని, కనుక వేట నిషేధమని మత్స్యశాఖ జేడీ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తప్పవన్నారు. ఏప్రిల్ 16 నుంచి గ్రామాల్లోని మత్స్యకార సహాయకుల వద్ద మత్స్యకారులు తమ పూర్తివివరాలను నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.



# బాదుడు మీద బాదుడు

## ○ మొన్న విద్యుత్ షాక్‌లు.. నేడు ఆర్టీసి వాతలు

**మొన్న విద్యుత్‌చార్జీల బాదుడు.. ఇప్పుడు బస్‌చార్జీల బాదుడు. ఇలా బాదుడు మీద బాదుడులతో ప్రభుత్వం ప్రజల వీపు విమానం మోత మోగిస్తోంది. ప్రజాసంక్షేమం పేరుతో.. ఉచిత పథకాల పేరుతో కోట్ల రూపాయలను పంచేస్తూ.. మరోవైపు... అసలే పెరిగిన ధరలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలపై ఇతరత్రా వడ్డింపులతో నడ్డి విరిగే విధంగా ప్రభుత్వం చార్జీల భారం మోపుతోందని ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.**

అసలే పెట్రోలు డీజిల్ ధరలు పెరిగిపోయి అన్ని రకాల నిత్యావసర సరుకుల ధరలు కూడా పెరిగిపోవడంతో ఏమీ కొనలేక.. ఏమీ తినలేక నిరుపేదలు, సామాన్య మధ్యతరగతి ప్రజలు అల్లాడిపోతున్నారు. కూరగాయల ధరల నుంచి అన్నిటి ధరలు కొండెక్కి కూర్చున్నాయి. ఈ ధరలను ఆకాశం నుంచి కిందికి దింపే ఆలోచనలేమీ చేయకుండా, తాజాగా మరిన్ని వడ్డనలకు ప్రభుత్వం సిద్ధం అవుతుండడం పట్ల ప్రజలు ఎంతో ఆందోళనకు గురవుతున్నారు. విద్యుత్ లేకుండా ఫ్యాన్లు తిరగవు, లైట్లు వెలగవు. అసలే ఎండా కాలం. ఎలా బతకాలి?. విద్యుత్‌కు బాగా అలవాటు పడిపోయాక, కరెంటు లేకుండా చేస్తే ఏం చేయాలి?.. అన్నది ప్రజల ఆవేదన. అన్ని ధరలు పెరుగుతుంటే కరెంటు ధరలు పెరగవా ఏంది?.. అన్నట్టుగా రాష్ట్ర ప్రభుత్వం. అంతర్జాతీయ స్థాయిలో ధరలు పెరిగితే మేం చేయగలిగిందేం లేదన్నట్టుగా మరోవైపు కేంద్ర ప్రభుత్వం పెట్రోలు ధరలను, వంట గ్యాస్‌ధరలను పెంచేస్తూ పోతుంటే.. ఇక ఆదుకునే దిక్కెవరు?.. ఈ ధరల మోతలతో సామాన్య, మధ్య తరగతి ప్రజల వీపులు వాతలు తేలిపోతున్నాయి.

### బస్సెక్కితే.. ఇక బాదుడే

చార్జీల వడ్డనలో భాగంగా ఆర్టీసి బస్సుల్లో కూడా భారీ వడ్డనలు తప్పడం లేదు. అన్నిటి ధరలు పెరిగినప్పుడు ఆర్టీసి ధరలు పెరగవా ఏమిటి?..అన్నట్లుగా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు తాజాగా బస్సు ప్రయాణీకులపై దృష్టి సారించింది. డీజిల్ ధరలు పెరిగిపోతున్నాయి కనుక ఆర్టీసి తిరగాలంటే చార్జీలు పెంచక తప్పదంటూ మరో వాత పెట్టింది. ఒక్కో ప్రయాణీకుడిపై వాళ్ళు తిరిగే బస్సు సర్వీసులను బట్టి కిలోమీటరుకు 5 నుంచి 10 రూపాయల వంతున అదనంగా చార్జీలు విధిస్తూ నిర్ణయం తీసుకుంది. దీనిప్రకారం పల్లెవెలుగు బస్సుల్లో 3 రూపాయలు, ఇతర సర్వీసుల్లో 10 రూపాయల దాకా ప్రయాణీకులు భారం మోయక తప్పని పరిస్థితి. ఎంతదూరం తిరిగితే అంత దూరం లెక్కన భారం పడుతుంది. ప్రయాణ దూరం పెరిగేకొద్దీ చార్జీల మోత మోగుతుంది. పల్లెవెలుగు బస్సుల్లోను, సిటీ బస్సుల్లోను.. ఇవి ఆర్డినరీ బస్సులే అయినా దూరాన్ని బట్టి 5 నుంచి 15 రూపాయల దాకా చార్జీ పెరుగుతుంది. కనీస చార్జీ ఇంతదాకా అయిదు రూపాయలు ఉండేది. అదిప్పుడు 10 రూపాయలకు పెరిగింది. అదేవిధంగా ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో రూ.15, డీలక్స్, అల్ట్రా డీలక్స్ బస్సుల్లో రూ.20, సూపర్ లగ్జరీలో రూ.30, ఏసీ ఇంద్ర బస్సుల్లోను, గరుడ, అమరావతి బస్సులు, డాల్ఫిన్ క్రూయిజ్, నైట్‌రైడర్ వంటి బస్సుల్లోనూ బస్సును బట్టి కనీస చార్జీ 40 రూపాయల దాకా, వెన్నెల బస్సు సర్వీసుల్లో 70 రూపాయల దాకా కనీస చార్జీ పెంచేశారు. విజయవాడ, బెంగుళూరు బస్సుల్లో ఎక్కితే ఈ తాజా చార్జీల ప్రకారం కనీసం 120 రూపాయల దాకా అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. అదేవిధంగా విజయవాడ నుంచి హైదరాబాద్‌కు వెళ్ళాలన్నా కనీసం 55 రూపాయల అదనపు చార్జీ చెల్లించాలి. విజయవాడ నుంచి విశాఖకు కనీసం 70 రూపాయలు అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. ఆర్టీసికి నష్టమని, దానిని పూడ్చుకోవాలంటే ప్రయాణీకుల జేబులకు చిల్లు పెట్టక తప్పదని అంటున్నారు. ఇక ఈ పరిస్థితుల్లో మూలిగే నక్కమీద ఇలా తాటికాయలు పడుతూనే ఉంటాయి. ఇదే అదనుగా ప్రైవేటు వాహనాల వారు కూడా ప్రయాణీకుల ముక్కులు పిండేస్తారు. ఏదేమైనా..అడ్డూ అదుపు లేకుండా ధరలు పెరిగిపోతున్నా నియంత్రించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోకుండా.. చార్జీలు పెంచడం ఏమాత్రం సముచితమో ప్రభుత్వాలే ఆలోచించాలి!



## 4 రెవెన్యూ డివిజన్లు.. 38 మండలాలు

### మారిపోయిన

# నెల్లూరు జిల్లా ముఖచిత్రం



**నెల్లూరు, ఆత్మకూరు, కావలి, కందుకూరు రెవెన్యూ డివిజన్లతో, 38 మండలాలతో శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా సరికొత్తగా రూపుదాల్చింది. రాష్ట్ర ప్రభుత్వం కొత్తజిల్లాల ఏర్పాటులో భాగంగా జిల్లాల పునర్వ్యవస్థీకరణలో నెల్లూరుజిల్లా ముఖచిత్రం మారిపోయింది. ఆ మేరకు నోటిఫికేషన్ కూడా విడుదలై కొత్త జిల్లాల పాలనకు కూడా ఇటీవలే శ్రీకారం చుట్టడం జరిగింది. పాలనకు అనుగుణంగా నెల్లూరుజిల్లా నుంచి అనేకమంది ఉద్యోగులు తిరుపతి జిల్లాకు వెళ్ళాల్సి ఉంటుంది. అందుకవసరమైన కసరత్తును కూడా జిల్లా అధికారయంత్రాంగం ముమ్మరం చేసింది.**

జిల్లాలో ప్రధాన భాగంగా ఉన్న గూడూరు, సూళ్ళూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు తిరుపతి జిల్లా పరిధిలోకి వెళ్ళిపోవడంతో నెల్లూరుజిల్లా ఇప్పటిదాకా ఉన్న చారిత్రిక ప్రాముఖ్యతను కోల్పోయినట్లయింది. నెల్లూరులోని మూడు ప్రధానమైన డివిజన్లను తిరుపతిజిల్లాలో కలిపేసి, ప్రకాశం జిల్లా నుంచి ఒక డివిజన్‌ను తీసుకొచ్చి నెల్లూరులో చేర్చారు. ప్రతి పార్లమెంట్ నియోజకవర్గాన్ని ఒక జిల్లాగా మార్చాలని సిఎం జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయానికనుగుణంగా ప్రభుత్వం శరవేగంగా మార్పుల ప్రక్రియను చేపట్టింది. దీంతో జిల్లా రూపురేఖలే మారిపోయాయి. నెల్లూరుజిల్లాలో దశాబ్దాల తరబడి అనుబంధం ఉన్న అనేకప్రాంతాలు నెల్లూరును వీడిపోయాయి. జిల్లాలోని 46 మండలాలు ఇప్పుడు 38కి తగ్గిపోయాయి. సర్వేపల్లితో పాటు, వెంకటగిరి నియోజకవర్గంలోని రాపూరు, సైదాపురం, కలువాయి మండలాలు కూడా తిరుపతిలో కలిసిపోయేవే కానీ ఆయా ప్రాంతాల ప్రజలు, ఎమ్మెల్యేల అభ్యర్థనతో వాటినెలాగో నెల్లూరు జిల్లాలోనే కొనసాగిస్తున్నారు. ఇక మిగిలిన మండలాలు, కందుకూరు డివిజన్‌ను నుంచి కలసిన మండలాలతో కలిపి కొత్తగా రూపొందించిన జిల్లా ముఖచిత్రం దాదాపుగా ఖరారైపోయినట్లే.

### నాలుగు డివిజన్లలోని మండలాలు :

మొత్తం నాలుగు డివిజన్లలో..నెల్లూరు రెవెన్యూ డివిజన్‌లో నెల్లూరు నగరం, నెల్లూరు రూరల్, కోవూరు, బుచ్చిరెడ్డిపాళెం, ఇందుకూరుపేట, తోటపల్లిగూడూరు, ముత్తుకూరు, వెంకటాచలం, మనుబోలు, పొదలకూరు, సైదాపురం మండలాలుంటాయి. ఆత్మకూరు రెవెన్యూ డివిజన్‌లో ఆత్మకూరు, చేజర్ల, అనుమసముద్రంపేట, మర్రిపాడు, సంగం, అనంతసాగరం, ఉదయగిరి, సీతారామపురం, కలువాయి, రాపూరు మండలాలుంటాయి. కావలి రెవెన్యూ డివిజన్‌లో కావలి, బోగోలు, అల్లూరు, దగదర్తి, జలదంకి, కలిగిరి, దుత్తలూరు, విడవలూరు, కొడవలూరు, వింజమూరు మండలాలుంటాయి. కొత్తగా కలిసిన కందుకూరుతో పాటు, లింగసముద్రం, గుడ్లూరు, ఉలవపాడు, ఓలేటివారిపాళెంలతో కొండాపురం, వరికుంటపాడులను కలిపి కందుకూరు రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటుచేశారు. పోలీస్ సబ్ డివిజన్లను కూడా మొత్తంగా అయిదింటిని ఏర్పాటుచేస్తున్నారు. నెల్లూరు నగరం, నెల్లూరు రూరల్, కావలి, ఆత్మకూరు, కందుకూరుల్లో ఇవి ఏర్పాటవుతున్నాయి. దీంతో ఇక ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి తమకు అవసరమైన పనుల కోసం తిరుపతి జిల్లాలో కలిసిపోయిన మండలాల ప్రజలు తిరుపతికి, నెల్లూరు జిల్లాలో కలిసిన కందుకూరు డివిజన్ ప్రజలు జిల్లా కేంద్రమైన నెల్లూరుకు రావడానికి ఇక అలవాటు పడాల్సి ఉంది.

## పన్నులు ముందుగా చెల్లిస్తే.. రాయితీ

ముందస్తుగా ఇంటిపన్నులు చెల్లించేవారికి 5 శాతం రాయితీ ఇస్తామని వెంకటగిరి మునిసిపల్ కమిషనర్ గంగా ప్రసాద్ తెలిపారు. అలా ముందస్తుగా పన్నులు చెల్లించేవారి కోసం మునిసిపల్ కార్యాలయం వద్ద ప్రత్యేకంగా కౌంటర్ కూడా ఏర్పాటుచేశామని, ఇళ్ల యజమానులు ఆన్‌లైన్‌లో కూడా పన్నులు చెల్లించవచ్చని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# ఇటు తమిళిసై..! అటు కేసీఆర్.. సై సై..!!

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, తెలంగాణ తొలి మహిళా గవర్నర్ డాక్టర్ తమిళిసై... ఇద్దరూ మర్యాదస్తులే. ఇద్దరూ ఉన్నత విద్యావంతులే. ఎవరి అధికార పరిధి, ఎవరి రాజకీయ మర్యాదలు వారు తెలిసిన వారే. పరస్పరాత్మీయాభిమానాలు పంచుకున్నవారే.

కానీ, కొన్ని కొన్ని ఘటనలు... సంఘటనలు యాధృచ్ఛికంగా మనుషుల్ని వేరు చేస్తాయి.... కలుపుతాయి అన్నట్టుగా.... వీరిద్దరి మధ్య కొంత కమ్యూనికేషన్ గ్యాప్ ఏర్పడినట్టుగా కొంతకాలంగా పరిశీలకులు వేస్తున్న అంచనాలు చివరకు నిజమయ్యాయి.

ఆమే స్వయంగా ఢిల్లీలో చెప్పినట్టుగా... ఆమెకు నిజంగానే భేషిజం లేదు. ఈగో సమస్య అసలు లేదు. కలివిడితనం, మనుషుల పట్ల ప్రేమాభిమానాలు, తన సందర్శకులు ప్రస్తావించే అంశాలపై... కళ్ళతో కాకుండా, మనసుతో స్పందించేతత్వం ఆవిడ ప్లస్‌పాయింట్స్. గవర్నర్ స్థాయి వ్యక్తుల్లో ఈ లక్షణాలు కనిపించడం చాలా అరుదైన అంశం.

'జర్నలిజంలో నా 40ఏళ్ళ ప్రయాణం' పేరిట నేను ప్రచురించిన 'రాస్తూనే ఉందాం !' అనే పుస్తకాన్ని బహుకరించడానికి గవర్నర్‌ను కలిశాను. ఆమె ఎదురుగా ఉన్నది ఏడు నిముషాలే అయినా.. గవర్నర్‌తో కాక, మన కుటుంబసభ్యురాలితో మాట్లాడుతున్న ఆత్మీయ అనుభూతి కలిగింది. పుస్తకంలోని పేజీలు చాలా ఆపేక్షగా తిరగేస్తూ, 'నాకు తెలుగు రాదుగా...!' అన్నారు, నవ్వుతూ. దానిలోని అంశాలను ఓ రెండు మూడు నిముషాల పాటు నాకు వచ్చిన ఇంగ్లీష్‌లో చెప్పాను. ఆసక్తిగా విని 'ఈ బుక్‌ను రాజభవన్ లైబ్రరీలో పెట్టండి' అంటూ ఓ సహాయకుడికి ఇచ్చారు. అంత భోళాతనం కనిపించింది ఆవిడలో. నాతో పాటు వచ్చిన మనవడిని దగ్గరకు తీసుకుని... 'నీ పేరేమిటి ? ఏం చదువుతున్నావ్? ఏ స్కూల్?' అంటూ ఎంతో ఆప్యాయంగా ప్రశ్నించారు. తమిళిసైలాగానే, తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా భోళా శంకరుడే. కాకపోతే ఆయనకు ఆగ్రహం వచ్చినా... అనుగ్రహం కలిగినా పట్టుకోవడం కష్టం. ఆ రెండూ ఎందుకు, ఎప్పుడు, ఎలా కలుగుతాయో చెప్పడం కూడా కష్టమే. ఈ రెండింటిలో ఏది వచ్చినా... వరదలై పారాల్సిందే. అయితే అతివృష్టి... కాకపోతే అనావృష్టి అన్నమాట. చిన్నజీయ్యర్ స్వామి పట్ల ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రదర్శించిన రాగద్వేషాలే ఇందుకు నిదర్శనం. ఏదీ మనసులో దాచోకోలేరు. కేసిఆర్‌కు అనుగ్రహం కలిగినా... ఆగ్రహం కలిగినా మనసులో దాచేసి పైకి విషపు నవ్వులు నవ్వే నేత కాదు.




డాక్టర్ తమిళిసై.... కేసీఆర్ మధ్య సంబంధాలు హుజూరాబాద్ ఉపఎన్నిక ముందునాటి వరకూ నయనానందకరంగానే ఉండేవి. ఇద్దరిమధ్య సంబంధాలు పరస్పర సుహృద్భావంగా ఉన్నాయన్న భావనే కలిగేది.

అయితే, ఈటల రాజేందర్ బీజేపీ అభ్యర్థిగా హుజూరాబాద్ నుంచి పోటీ చేయడంతో కేసీఆర్ ఆ ఉపఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. అక్కడ తనకు కలిసివచ్చే వారికోసం వెతికే క్రమంలో కేసీఆర్ దృష్టి... పాడి కౌసిక్‌రెడ్డి అనే ఒక కాంగ్రెస్ యువనేతపై పడింది. 2018 ఎన్నికల్లో కౌసిక్‌రెడ్డి అక్కడినుంచే టీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీచేసిన ఈటల రాజేందర్‌పై కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేస్తే... దాదాపు 60వేలకు పైబడి ఓట్లు వచ్చాయి. బహుశా ఆ కారణం వల్ల కావచ్చు, కౌసిక్‌రెడ్డిని టీఆర్ఎస్‌లోకి ఆహ్వానించి, ఎంఎల్‌సీని చేసి, ప్రచారంలోకి దించుదామని కేసీఆర్ భావించి ఉంటారు. ఇందులో తప్పు పట్టవలసింది ఏమీ లేదు. ప్రభుత్వం సిఫారసు చేసే అనేకమంది రాజకీయవాదులను ఎంఎల్‌సీలుగా గవర్నర్ నియమించవలసి ఉంటుంది. ఆ పని గవర్నర్ చేసి ఉంటే అసలు సమస్య ఉండి ఉండేది కాదు. కానీ, తెలంగాణ మంత్రివర్గం చేసిన కౌశిక్‌రెడ్డి సిఫారసును గవర్నర్ పరిగణనలోకి తీసుకోలేదు. ఇక్కడే అపార్థాలు మొదలయ్యాయి.

హుజూరాబాద్‌లో అటు బీజేపీ, ఇటు టీఆర్ఎస్ నేతలు చావో... రేవో... అన్నట్టుగా మోహరించి ఉన్న తరుణంలో కౌసిక్‌రెడ్డి ఫైల్‌ను ఆమె వెంటనే క్లియర్ చేయకపోవడంతో టీఆర్ఎస్‌ను ఇబ్బంది పెట్టాలనే బీజేపీ సూచనతో గవర్నర్ ఇలా చేసి ఉంటారని ముఖ్యమంత్రి భావించి ఉంటారు. తమిళనాడు బీజేపీ శాఖ అధ్యక్షురాలుగా ఉన్న ఆమెను ఉన్నట్టుండి తెలంగాణ గవర్నర్‌గా నియమించడంతో కౌసిక్‌రెడ్డి విషయంలో ఆమె, కావాలనే టీఆర్ఎస్‌ను ఇబ్బంది పెడుతున్నారనే భావన ప్రభుత్వంలో బలంగానే కలిగింది. ఇటువంటి భావన టీఆర్ఎస్‌కు కలిగే అవకాశం ఉన్నదని గవర్నర్ ముందుగానే అంచనా వేసి ఉండాల్సింది. లేదా... అంచనా వేసే కౌసిక్‌రెడ్డి నియామక ఫైల్‌ను కోల్డ్‌స్టోరేజ్‌లో పడేశారేమో తెలియదు. ఈ విషయంలో ఆమె అంచనా ఏదైనప్పటికీ హుజూరాబాద్ ఉపఎన్నిక నేపథ్యంలో గవర్నర్ చర్యలో టీఆర్ఎస్ వర్గాలు పూర్తి రాజకీయాన్ని చూశాయి.

అయితే ఈ 'అపార్థం' తొలగింపుకు అటు గవర్నర్ గానీ ఇటు ప్రభుత్వ వర్గాలు గానీ చొరవ తీసుకున్నట్టు లేదు. అసెంబ్లీ సమావేశాలకు గవర్నర్‌ను ఆహ్వానించకపోవడం, మంత్రులు... ఉన్నతధికారులు గవర్నర్‌ను అసలు పట్టించుకోకపోవడంతో ప్రగతి భవన్‌పై వాలిన కాకి... రాజ్‌భవన్ మీద వాలడం లేదు. మొదలైన విషయాలు బహిరంగ రహస్యమైపోయాయి.

తెలంగాణ ప్రభుత్వం తన పట్ల వ్యవహరిస్తున్న తీరును అవమానకరంగా భావిస్తున్న డాక్టర్ తమిళిసై, దానిని ఎక్కువ రోజులు మనసులో దాచుకోలేకపోయారు.



తెలంగాణ గవర్నర్ తమిళిసైకి 'రాస్తూనే ఉందాం' పుస్తకాన్ని అందిస్తున్న భోగాది రాయుడు(ఫైల్‌ఫోటో)

ఢిల్లీ వెళ్లి, ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షాకు 'సవివరం'గా విన్నవించారు. వెంటనే.. ఢిల్లీలోనే... అక్కడికక్కడే.... అప్పటికప్పుడే... తన కడుపు లోని ఆవేదనను అంతా మీడియా ముందు వెళ్ళగక్కారు. అవసరమైన దానికంటే కూడా ఎక్కువ మాట్లాడారు. గవర్నర్ హోదాలో హుందాగా... అత్యంత మితంగా... సూచన ప్రాయంగా మాట్లాడాల్సిన డాక్టర్ తమిళిసై ఆ భావన కలిగేలా మాట్లాడలేదేమో అనిపించే విధంగా మాట్లాడారు.

ఆమెకు లౌక్యం తెలియకపోవడం ఒక కారణమైతే... కల్లా కపటం లేని స్త్రీ సహజమైన ఆవేదన వ్యక్తీకరించే తీరు ఒక కారణమై ఉండవచ్చు. ఆమె హైదరాబాద్ తిరిగి వచ్చి, తన అస్త్రాలను ఒక దాని తరువాత ఒకటి సందర్భానుసారంగా వదులుతూ ఉన్నట్టయితే బాగుండేది. ఇప్పుడు ఒక్కసారే గుప్పెట విప్పినట్టయింది. ప్రధానికి, హోంమంత్రికీ ఫిర్యాదుచేసి, రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా తప్పుబడుతూ... ఢిల్లీలో నిప్పులు చెరిగిన తరువాత కూడా ఏ భవన్ మీద కాకి, ఆ భవన్‌పైకే పరిమితం అయిపోయింది. ఇప్పుడు శ్రీరామనవమికీ భద్రాచలం వెళ్లిన గవర్నర్‌ను ప్రభుత్వం పట్టించుకోలేదు.

ఎన్నికైన ప్రభుత్వాలు కేంద్ర నియమిత గవర్నర్‌ల మధ్య ఈ రకమైన 'అనవసర' ఘర్షణలకు రాజకీయాలే ప్రధాన కారణమైపోయాయి.

ఉదాహరణకు, ఆంధ్రలో ప్రభుత్వానికి, గవర్నర్‌కు మధ్య ఈషణ్మాత్రం కూడా అభిప్రాయ భేదం రావడం లేదు. ముఖ్యమంత్రి జగన్ పట్ల కేంద్ర బీజేపీ ప్రభుత్వానికి స్నేహపూర్వక సంబంధాలు ఉండడమే ఇందుకు కారణం. అదే బెంగాల్‌లో... రోజువారీ ఫైటింగే.

ఇక, రెండు 'భవన్ల' మధ్య విభేదాలు తలెత్తి, ముదిరి పాకాన పడుతున్న విషయం బహిరంగమైపోయింది. 'బీజేపీ సంగతి తరువాత చూద్దాం. ముందు గవర్నర్ సంగతి చూద్దాం...' అనే స్థాయికి టీఆర్ఎస్ పెద్దలు డిసైడ్ అయితే, కేసీఆర్ చేతికి ఒక కొత్త ఆయుధాన్ని బీజేపీ ఇచ్చినట్టే! దీనిని నివారించడానికి డాక్టర్ తమిళిసై ఒక ప్రయత్నం చేయాలి.

రాష్ట్ర ప్రభుత్వం అంటే మూడున్నర కోట్ల తెలంగాణ ప్రజలకు ప్రతినిధి. వారికి అది జవాబుదారీగా ఉండాల్సి ఉంటుంది. గవర్నర్ వ్యవస్థ మాత్రం ఎవరికీ బాధ్యత వహించదు ప్రధాని, హోంమంత్రికి తప్ప.

ఈ పదవిలో దారినపోయే దానయ్యతో సహా, ఎవరినైనా కేంద్రం(అంటే ప్రధాని) నియమించవచ్చు. ఈ పదవి ఎవరికీ జవాబుదారీ కాదు.

అటువంటి గవర్నర్ వ్యవస్థ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం మీద పడాలని అనుకున్నా... గవర్నర్ వ్యవస్థకే నష్టం. ప్రభుత్వం వెళ్లి... గవర్నర్ వ్యవస్థ మీద పడినా గవర్నర్ వ్యవస్థకే నష్టం. గవర్నర్లను నియమించేది కేంద్రమే అయినప్పటికీ గవర్నర్ పరివారానికి అయ్యే కోట్లాది రూపాయల ఖర్చును భరించేది మాత్రం ఆయా రాష్ట్ర ప్రభుత్వాలే. ఒక్క పైసా కూడా కేంద్రం ఇవ్వదు. రాజ్‌భవన్‌లపై పెత్తనం మాత్రం కేంద్రానిది.

కేసీఆర్‌తో తలెత్తిన 'కమ్యూనికేషన్ గ్యాప్‌ను పూడ్చుకోడానికి డాక్టర్ తమిళిసై చొరవ తీసుకోకపోతే 'తెలంగాణ ద్రోహి'గా ముద్రాంకితమయ్యే ప్రమాదం లేకపోలేదు. ఆమె ప్రొఫైల్‌కు, వ్యక్తిత్వానికి, మంచి మనసుకు, భోళాతనానికి ఆ 'ముద్ర' నప్పదు.

అలాగే, గవర్నర్ నుంచి వస్తున్న మరో ముప్పును సీ.ఎం గమనించారో... లేదో తెలియదు. జనంలో నిత్యం ఉండడానికే ఎక్కువగా ఇష్టపడే డాక్టర్ తమిళిసై... ప్రభుత్వ మర్యాదలతో సంబంధం లేకుండా, నేరుగా ప్రజల్లోకి వెళతారు. సమాజానికి దూరంగా ఉన్న ట్రైబల్స్, దళితులు వద్దకు వెళతారు. వారితో కలిసి ఆడి, పాడి, భోంచేస్తారు. వారి ఆరోగ్య సమస్యలపై దృష్టిపెడతారు.


ఈ పర్యటనల్లో మంత్రులు, ఎంఎల్‌ఏలు, ఎం.పీలు కనపడరు. కలెక్టర్ కనపడరు. ఎస్.పీ కనపడరు. గవర్నర్ అంతటి ఆవిడ వచ్చి తమ కష్టసుఖాలు తెలుసుకుంటుంటే... ఈ జనం అంతా ఏమైపోయారనే చర్చ మొదలవుతుంది. దీనికి జవాబు చెప్పుకోవలసిన పరిస్థితి పాలక పెద్దలకు ఏర్పడుతుంది. ప్రగతి భవన్‌లోకి కలలో కూడా ఎంట్రీ దొరకని పీడిత, తాడిత, బీదా బిక్కీ జనానికి రాజ్‌భవన్ గేట్లు బార్లా తెరుచుకుంటాయి.

**- భోగాది వేంకట రాయుడు**
bhogadirayudu2152@gmail.com

# నెల్లూరుకు 27న.. ఉప రాష్ట్రపతి రాక


## ఆకాశవాణి ఎఫ్ఎం టవర్ ప్రారంభించనున్న మన వెంకయ్య





భారత ఉప రాష్ట్రపతి, మన నెల్లూరీయుడు ముప్పవరపు వెంకయ్యనాయుడు చొరవతో నెల్లూరులో ఏర్పడిన ఆకాశవాణి కేంద్రం, ఆయన కృషితోనే మరింత అభివృద్ధి చెందుతోంది. కేంద్రప్రభుత్వ సహకారంతో ఎఫ్ఎం టవర్‌తో పాటు రేడియోస్టేషన్‌లో పలు వసతుల కల్పన జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఉపరాష్ట్రపతి ఈనెల 27న నెల్లూరు పర్యటనకు వస్తున్నట్లు సమాచారం. నగరంలోని పొదలకూరు రోడ్డులో ఉన్న ఆలిండియా రేడియో కేంద్రంలో రూ.10కోట్లతో నిర్మించిన వందమీటర్ల టవర్‌కు ఆయన ప్రారంభోత్సవం చేయనుండడంతో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఉపరాష్ట్రపతి పర్యటనకు ఏర్పాట్లు చేస్తున్నారు.

# కరోనా తగ్గిందెక్కడ?



- 50 కోట్లను దాటేసిన కోవిడ్
- 62 లక్షలకు పైగానే మరణాలు
- ఆసుపత్రులలో లక్షల్లో బాధితులు
- ప్రపంచాన్ని భయపెడుతున్న వైరస్

*ప్రపంచాన్ని కరోనా వణికిస్తూనే ఉంది. ఆ మహమ్మారి వ్యాధి తగ్గుతున్నట్లు కనిపిస్తూనే 'తగ్గేదే లే' అంటూ ..మళ్లీ కొత్తకొత్త వేషాలతో మానవాళిని భయపెడుతూనే ఉంది. తాజా లెక్కల ప్రకారం ఈనెల13 నాటికి ప్రపంచంలో కోవిడ్ కేసుల సంఖ్య 50కోట్లు దాటేసి మరో 12 లక్షలకుపైగానే చేరుకుంది. ఇది అంతకంతకూ పెరుగుతున్నదే తప్ప తరగడమన్నదే లేదు. ఇప్పటికే ప్రపంచంలో కరోనా మరణాల సంఖ్య 62.10 లక్షలకు చేరుకుందంటే కరోనా విపత్తు ఎంత ఉధృతంగా ఉందో తేటతెల్లమవుతూనే ఉంది. కరోనా తగ్గిపోయిందిలే.. అనుకుంటున్నామే తప్ప.. ఇది ఇప్పట్లో అంతమయ్యేలా కనిపించడం లేదని నిపుణులు చెప్తున్నారు.*

ప్రపంచదేశాల్లో కరోనా కేసులు భారీగా పెరుగుతూనే ఉన్నాయి. కంటికి కనిపించని సూక్ష్మక్రిమి ప్రపంచాన్ని గత రెండేళ్ళుగా వణికిస్తూనే ఉంది. ఇప్పటికీ కొన్నిదేశాల్లో కరోనా విజృంభణ కొనసాగుతూనే ఉంది. మరికొన్ని దేశాల్లో ఇప్పుడిప్పుడే కరోనా కొత్త వేరియంట్లు (రూపాలు)గా పుట్టుకొచ్చి భీభత్సం చేస్తూనే ఉంది. ఇప్పటికే ప్రపంచంలో 50.12 కోట్లమందికి పైగానే ప్రజలు ఈ వ్యాధి బారినపడి నానా రకాల బాధలు పడ్డారు. ప్రపంచవ్యాప్తంగా 62.10 లక్షల మందిని కరోనా రాకాసి పొట్టనపెట్టుకుంది. ఇంకా ఎంతో మంది బాధితులు ఆసుపత్రుల్లో విషమపరిస్థితుల్లో ఉన్నారు. కరోనాకు పుట్టినిల్లయిన చైనాను కూడా కరోనా బెంబేలెత్తిస్తూ ఉంది. చైనా ఆర్థిక రాజధాని షాంఘై పూర్తిగా ఇప్పటికీ 'లాక్‌డౌన్'లోనే ఉందంటే కోవిడ్ ప్రతాపం ఏమాత్రం తగ్గలేదని అర్థమవుతోంది.

### భారత్‌లోనూ కోవిడ్ వీరంగం :

భారత్‌లో బాగా తగ్గినట్లు కనిపిస్తున్నా..లోలోపలే చాపకింద నీరులా కోవిడ్ విజృంభిస్తూనే ఉంది. అందుకే ప్రధాని మోడీ ఇటీవల 'కరోనా పోయిందని అనుకోకండి' అని ముందస్తుగా హెచ్చరించారు కూడా. అందుకు తగ్గట్లుగా కోవిడ్ చల్లగా పాకుతూ వస్తోంది. ఈనెల 13వ తేది ఒక్కరోజులోనే..24 గంటల్లో దేశవ్యాప్తంగా 1088 కేసులు నమోదయ్యాయి. 20 మంది మృత్యువాత పడ్డారు. అయితే గతంతో పోలిస్తే మనదేశంలో కరోనా విజృంభణ బాగా తగ్గినట్లేనన్న మాట వాస్తవం. రెండు డోసుల టీకా అందుబాటులోకి రావడం కరోనా నుంచి కాపాడుకోవడానికి ఒక పెద్ద వరం. అందుకే కాస్త నెమ్మదించింది. అట్లని అజాగ్రత్తగా ఉండడానికి వీల్లేదని, కోవిడ్ నిబంధనలు పాటిస్తూ స్వీయరక్షణలో ఉండడం, టీకా వేసుకోవడం, మాస్కులు ధరించి, సామాజిక దూరం పాటిస్తుండడం వంటివి మర్చిపోవద్దని నిపుణులు సూచిస్తున్నారు. అత్యంత వేగంగా వ్యాపించే లక్షణం ఉన్న ఎక్స్‌ఈ వేరియంట్ మనదేశాన్ని ఇటీవల కలవరపెడుతోంది. దీన్ని కూడా తట్టుకోగల సామర్థ్యం దేశానికెంతో అవసరం కూడా. కరోనా నివారణకు వేస్తున్న టీకాతో పాటు బూస్టర్ డోసు కూడా ప్రజలందరికీ అందుబాటులోకి తీసుకురావడం ఇప్పుడెంతో ముఖ్యం. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సరైన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకోవడం, వీలైనంత త్వరగానే టీకా రావడం, వైద్యనిపుణుల సూచనలతో ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటిస్తుండడం వల్లనే మనదేశంలో కరోనా విజృంభణ బాగా తగ్గుతోంది. అయినా ఇప్పటికే మనదేశానికి అన్నిరంగాల్లోనూ కరోనా చేసిన నష్టం అంతా ఇంతా కాదు. మొత్తంగా మనదేశంలో 4.30 కోట్ల మంది కోవిడ్ బారినపడ్డారని, 5.21 లక్షలమందికి పైగానే ప్రజలు ఈ వ్యాధితో మరణించారని కేంద్ర ఆరోగ్య కుటుంబసంక్షేమ శాఖ తాజా గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. మహారాష్ట్రలో 1.47 వేల మంది దాకా, కేరళలో 40వేల మందికి పైగా, తమిళనాడులో 38 వేలమందికి పైగా ప్రజలు ఈ వ్యాధికి బలైపోయారని ఆ నివేదికలు వెల్లడిస్తున్నాయి.

### మరో రెండు కొత్త వేరియంట్లు

కరోనా తన రూపాలు మార్చుకుంటూ విజృంభిస్తూనే ఉన్న నేపథ్యంలో.. ఒమిక్రాన్ వేరియంట్ ఇంకా మరో రెండు కొత్త వేరియంట్లుగా రూపాంతరం చెంది ప్రపంచాన్ని వణికిస్తోంది. ఇప్పటికే ఒమిక్రాన్ సబ్ వేరియంట్ బిఏ-2 ఒకవైపు వీరంగం చేస్తుంటే, మరోవైపు దక్షిణాఫ్రికాలో బిఏ-4, బిఏ-5 వేరియంట్లను కూడా శాస్త్రవేత్తలు తాజాగా గుర్తించారు. ఈ వేరియంట్లకు సంబంధించి ఇప్పటికే పలు దేశాల్లో పదుల సంఖ్యలో కేసులు నమోదువుతుండడం చూస్తే..ఒమిక్రాన్ వేరియంట్ ఎంత వేగంగా వ్యాపిస్తున్నదో అర్థమవుతోంది. దక్షిణాఫ్రికాలో పుట్టుకొచ్చిన ఆ రెండు వేరియంట్లు బోట్స్‌వానా, బ్రిటన్‌లలో కూడా వ్యాప్తి చెందుతున్నాయని, అయితే వీటివల్ల ప్రమాద తీవ్రత ఎంతగా ఉంటుందో ఇంకా నిర్ధారించలేకపోతున్నామని నిపుణులు అంటున్నారు. మన దేశంలోనూ ఇటీవలే బయటపడిన ఎక్స్‌ఈ వేరియంట్‌పై కేంద్రప్రభుత్వం దృష్టి సారించింది. ఈ వేరియంట్ ఏమేరకు ప్రభావవంతంగా ఉంటుందో, దాని వ్యాప్తి ఎలా ఉంటుందో తెలుసుకునేందుకు పరిశోధనలు చేస్తోంది.




Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com